


జనం సొమ్ము రాళ్లపాలు

1,60,147 సర్వే రాళ్లపై జగన్ పేరు

- పబ్లిసిటీ కోసం రూ.2 కోట్లు దుర్వినియోగం
- రీసర్వే చేసిన గ్రామాల్లో 300 అభ్యంతరాలు
- రైతులకు ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా..



సంతమాగులూరు : తంగేడుమల్లిలో జగన్ పేరుతో ఉన్న హద్దురాయిని పాతుతున్న దృశ్యం (పాత చిత్రం)

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పథకం ఏదైనా ప్రజలకు ఉపయోగపడిందా లేదా అనేది ముఖ్యం. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజాపయోగం కంటే ప్రచారానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పతాకస్థాయిలో ప్రచారం ఉండాలి.. అందులోనూ జగన్ పేరు, ఫొటో మాత్రమే ఉండాలనే తీరులో ఐదేళ్ల వైసీపీ పాలన సాగింది. రాజుల సొమ్ము రాళ్లపాలు అనే సామెత చందాన వైసీపీ ప్రభుత్వంలో ప్రజల సొమ్ము సర్వే రాళ్లకు సంతర్పణం చేసి పబ్లిసిటీలో సరికొత్త రికార్డు నెలకొల్పారు. సర్వే రాళ్లపై జగన్ పేరు, ఫొటో ముద్రించి పొలాల్లో పాతడానికి జిల్లాలో దాదాపు రూ.2 కోట్లు ఖర్చు చేశారు. కేంద్ర మార్గదర్శకాలు రీసర్వేకే పరిమితం చేయాల్సి ఉండగా పబ్లిసిటీ కోసం సర్వే రాళ్ల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి జనం సొమ్మును రాళ్ల పాలు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కింది. ఈ ఖర్చు విషయంలో పారదర్శకతకు పాతరేసి ఇష్టారీతిన వ్యవహరించారన్న ఆరోపణలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. రాయికి రూ.150లు ఖర్చు మాత్రమే అని చెప్పినప్పటికి రవాణా ఖర్చులన్నింటిని కలిపి దాదాపు రూ.250 వరకు వ్యయం చేసినట్లు తెలుస్తోంది. సర్వే రాళ్ల కోసం చేసిన ఖర్చు కూడా వైసీపీ నేతల జేబులు నింపడం కోసమే అన్నట్లుగా తయారైందనే విమర్శలు అప్పట్లో వెలువడ్డాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 109 గ్రామాలలో ఉన్న పొలాలకు జగన్ పేరుతో ఉన్న సర్వేరాళ్లను కేటాయించగా ఇప్పటికే 91 గ్రామాల్లో పాతారు. సర్వేరాళ్లను ఏ క్లాస్ స్టోన్స్, బీక్లాస్ స్టోన్స్‌గా విభజించి పొలాల్లో హద్దురాళ్లుగా పాతారు. ఏ క్లాస్ స్టోన్స్ 502 కాగా, బీక్లాస్ స్టోన్స్‌ను 1,59,645 కేటాయించారు. వీటిని రీసర్వే పూర్తయిన 91 గ్రామాలకు గాను 400 ఏక్లాస్ స్టోన్స్. 1,20,532 బీక్లాస్ స్టోన్స్‌ను ఇప్పటికే పొలాల్లో హద్దురాళ్లుగా వేశారు. జిల్లాలో గ్రానైట్ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉండడంతో బల్లికురవ పరిధిలోని వ్యాపారులను బెదిరించి మరీ గత ప్రభుత్వంలో సర్వే రాళ్లు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

ప్రహసనంగా రీసర్వే ఘట్టం...

రీసర్వే ఘట్టమే ఓ ప్రహసనంగా మిగిలిందనడాకి ఉదాహరణగా రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలనే చూపవచ్చు. రీసర్వే పూర్తయిన 91 గ్రామాల్లో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు దాదాపు 300 వరకు ఉన్నట్లు సమాచారం. అది ఎంత లోపభూయిష్టంగా జరిగిందన్న దానికి ఇదొక నిదర్శనంగా చెప్పవచ్చు. గ్రామాల్లోని వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఇది జరగడంతో వారి అనుకూలురుకు ఒకలా, ప్రత్యర్థి పార్టీ శ్రేణుల విషయంలో మరోలా వ్యవహరించి ఉన్న కాస్త పొలంలోనే పది నుంచి 20 సెంట్ల వరకు రీసర్వే వల్ల కోల్పోవలసి వచ్చిందని అప్పట్లో రైతులు వాపోయారు. భూములకు సంబంధించి పారదర్శకత కోసమే రీసర్వే అని గొప్పగా చెప్పుకున్న గత ప్రభుత్వం దీని వల్ల మరిన్ని కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన ఈ వ్యవహారం ఉందని రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులు వాపోతున్నారు. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ తతంగం నడిపించారని రైతులు ఆరోపిస్తున్నారు.

ఆరోపణలు.. అవినీతి..

సర్వే రాళ్ల పాతడం పేరు మీద పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారని, తమ ఇష్టాయిష్టాలతో పనిలేకుండా పొలాల్లో జగన్ పేరుఉన్న హద్దురాళ్లను పాతి పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని రైతులు అంటున్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులతో పాటు హద్దురాళ్లపేరిట ఖర్చుచేసిన సొమ్ము విషయంలో కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ చేయించాలని గ్రామాల్లోని రైతులు కోరుతున్నారు. సర్వేరాళ్ల పేరుతో పెట్టిన ఖర్చు విషయంలో సమగ్ర వివరాలు అందించాలని ఇప్పటికే అధికారులను కూటమి ప్రభుత్వం ఆదేశించింది. ఆ నివేదికలు అందాక నిధుల దుర్వినియోగంపై విచారణతో పాటు ఇప్పటికే పాతిన రాళ్ల విషయంలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సర్వేరాళ్ల విషయంలో పెద్ద ఎత్తున దోపిడీ జరిగినట్లు ఇటీవలే కూటమి ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.

పంచాయతీలకు.. పండగే

- కేంద్రం నుంచి భారీగా నిధులు
- 1172 పంచాయతీలకు రూ.68.69 కోట్లు
- జడ్పీ, మండల పరిషత్‌లకు రూ.12.75 కోట్లు
- రెండు రోజుల్లో ఆయా ఖాతాలకు నిధుల జమ
- నిధులపై మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం
- శానిటేషన్, సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యలకు మోక్షం
- వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి బలైన పంచాయతీ వ్యవస్థ



పంచాయతీల బలోపేతం తోనే.. స్థానిక స్వపరిపాలన. పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్ఠతే అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. సచివాలయ వ్యవస్థతో పంచాయతీల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఇక నిధులను ఇవ్వక పోగా కేంద్ర ప్రభు త్వం జారీ చేసే ఆర్థిక సంఘం నిధులను కూడా జగన్ ప్రభుత్వం దారి మళ్లించుకుని దుర్విని యో గం చేసింది. ఒకవైపు హక్కులు, విధులు, నిధులు కోల్పోయి పంచాయ తీ పాలకవర్గాలు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించు కోలేదు. నిధులు లేక కనీస పనులు కూడా చేయలేక పంచాయతీలు కునా రిల్లిపోయాయి. ఉనికే ప్రశ్నార్థకంగా మారిన పంచాయతీ రాజ్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వంతో మళ్లీ పూర్వ వైభవం వస్తోంది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వంలో దారి మళ్లిన ఆర్థిక సంఘం నిధులను తాజాగా పంచాయతీల ఖాతాలకు కూటమి ప్రభుత్వం జమ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పైగా ఐదేళ్ల వైసీపీ పాలనలో ఊసేలేకుండా పోయిన గ్రామసభల నిర్వహణకు కూడా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తంమీద మసకబారిన గ్రామ పంచాయతీల ప్రతిష్ఠ కూటమి ప్రభుత్వంతో తిరిగి ప్రకాశించనున్నది.

గుంటూరు, నరసరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పంచాయతీలకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పూర్తిగా గాడి తప్పిన పంచాయతీరాజ్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. నిధుల విడుదల, గ్రామసభల నిర్వహణతో పంచాయతీలకు మంచి రోజులు రానున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులను భారీ మొత్తంలో రాబట్టుకోవడంతో పాటు, వాటిని స్థానిక సంస్థల అభివృద్ధి పనులకే వినియోగంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పంచాయతీరాజ్ వ్యవస్థకు ప్రాణం వచ్చినట్లయింది. కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకే నేరుగా వచ్చేలా చర్యలు తీసుకుంది. వైసీపీ పాలనలో గడిచిన ఐదేళ్లుగా పంచాయతీల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా లేదు. ఆఖరికి స్వాంతంత్ర్య, గణతంత్ర వేడుకలు చేయాలన్నా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఎవరో ఒకరు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిరర్థకంగా తయారయాయి. అలాంటి దశలో నేడు గ్రామ పంచాయతీలకు భారీ మొత్తంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రావడంతో గ్రామాల్లో కొత్త కళ సంతరించుకోనుంది. గత ప్రభుత్వం నిధులు దారి మళ్లించి పారిశుధ్యాన్ని గాలికి వదిలేయడంతో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలన్నీ మూతపడిపో యాయి. యం త్రాలన్నీ తుప్పు పట్టి పాడైపోయాయి. తాజాగా నిధులు రావడంతో తిరిగి ఆ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. దీంతో పాటు గ్రామాల్లో మురుగునీటి వ్యవస్థ సమర్థవంతంగా నిర్వహిం చేందుకు డ్రెయినేజీల నిర్మాణానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించుకోగలిగితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 2వేల కిలో మీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించుకునే వీలు ఉంటుంది. స్థానిక సంస్థలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయగా కూట మి ప్రభుత్వం వాటి బలోపేతానికి చర్యలు తీసుకుంటోంది. నిధులను దారి మళ్లించగా ఆందోళనలు చేసిన పంచాయతీ పాలకవర్గాలపై జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ నిధుల విడుదలతో పాటు స్థానిక సంస్థల బలోపేతానికి చర్యలు చేపట్టడంపై వివిధ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

దారి మళ్లించిన వైసీపీ.. జమ చేసిన కూటమి

పంచాయతీలకు మూడు రకాలుగా ఆదాయం సమకూ రుతుంది. అయితే ఆర్థిక సంఘం నిధులే కీలకం. గ్రామాల్లో తక్కువ జనాభా ఉండడం, జీవన ప్రమాణాలు స్వల్పంగా ఉండడంతో పన్నుల ద్వారా వచ్చే ఆదాయం నామమాత్రమే. చిన్న పంచాయతీలైతే కనీసం 10 వేల రూపాయలు కూడా ఆదాయం రాదు. రెండో ఆదాయ వనరు నరేగా. వాటిని గ్రామీణ ఉపాధి హామీ పనులకు మాత్రమే వినియోగించు కోవాలి. దీంతో ఆ నిధుల వినియోగానికి పరిమితులు ఉన్నాయి. గత ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని సచివాలయాలు, విలేజ్ హెల్త్ సెంటర్లు, లైబ్రరీల నిర్మాణానికి వినియోగించింది. దీంతో ఆర్థిక సంఘం నిధులే పంచాయతీలకు దిక్కయ్యాయి. కేంద్రం ప్రభుత్వం 2024 మార్చి 28న 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధుల ను విడుదల చేసింది. ఈ నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించి స్థానిక సంస్థలకు మొండి చేయి చూపింది. అడ్డదారు ల్లో ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలోకి మళ్లించుకుంది. గ్రామీణాభివృద్ధికి తప్ప మరే విధంగానూ వినియోగించ రాదని తెలిసినా, ఆ నిధులను దారి మళ్లించింది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వైసీపీ ప్రభుత్వం లక్ష్య పెట్టలేదు. నిధుల్లేక కనీసం పారిశుధ్య పనులను నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొన్నా.. సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా జగన్ ప్రభుత్వానికి పట్టలేదు. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన వెంటనే ఒక్కో పంచాయతీలో రూ.3 నుంచి 5 లక్షల వరకు కరెంటు బిల్లులు, రాష్ట్ర ఖజానాకు జమయ్యే ఇతర చెల్లింపులకు వినియోగించింది. దీంతో పంచాయతీ నిధులు మొత్తం రాష్ట్ర ఖజానాకు జమయ్యేవి. చివరికి 2024 ఎన్నికలకు ముందు మార్చిలో విడుదలైన ఆర్థిక సంఘం నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించింది. గ్రామ సభలు పెడితే ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయని వాటిని కూడా పక్కన పెట్టేశారు. ఈ పరిస్థితికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. పంచాయతీరాజ్ వ్యవస్థకు తిరిగి ప్రాణం పోస్తూ స్థానిక స్వపరిపాలనకు రూపకల్పనకు నడుంకట్టింది. ఎన్నికల ముందు ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు విడుదల చేసి వాటిని బలోపేతం చేస్తామని కూటమి నేతలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకారం అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే నిధులను పంచాయతీలకు కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 23న రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, మంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించడంపైనా ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. గ్రామ సభల్లోనే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రచించి, ముందుకు సాగేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

నిధుల విడుదల ఇలా..

కేంద్రం నుంచి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు స్థానిక సంస్థల ఖాతాలకు రెండు రోజుల్లో జమ కానున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని 1172 పంచాయతీలు, గుంటూరు జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు కలిపి మొత్తం రూ.81.44 కోట్లు విడుదలయ్యాయి. జనాభా ప్రాతి పదికన పంచాయతీలకు నిధులను విడుదల చేశారు. పల్నాడు జిల్లాలో 519 పంచాయతీలకు రూ.29.50 కోట్లు, బాపట్ల జిల్లాలో 426 పంచాయతీలకు రూ.22.89 కోట్లు, గుంటూరు జిల్లాలోని 227 పంచాయతీలకు రూ.16.30 కోట్లు విడుదలయ్యాయి. ఇక గుంటూరు జిల్లా పరిషత్‌కు రూ.5.16 కోట్లు, మండల పరిషత్‌లకు రూ.7.59 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

వ్యయంపై మార్గదర్శకాలు..

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల వ్యయానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రకారం స్థానిక సంస్థల్లో ప్రజల మౌలిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని ఆదేశించింది. జలవనరులను పెంపొందించుకునేందుకు చెరువులు, కుంటలు అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలు ఏర్పాటు, తాగు నీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, మరు గుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వాహణ తదితర పనులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించింది. ఆర్థిక ఇబ్బందు లతో కునారిల్లుతున్న పంచాయతీలు ఈ నిధులతో కొంత మేర నిలదొక్కుకునే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం విష జ్వరాలు, అడుగంటిన పారిశుధ్యం, దోమలు, అపరిశుభ్రత తదితర సమస్యలతో అల్లాడుతున్న గ్రామాల్లో ఆయా సమస్యలు తీరే అవకాశం ఏర్పడింది. 15వ ఆర్థిక సంఘం నిధులలో 50 శాతం నిధులు పారిశుధ్యంపైనే ఖర్చు చేయనున్నారు. ప్రధానంగా తడిచెత్త, పొడిచెత్త కార్యక్రమ నిర్వహణతో పాటు, చెత్త నుంచి సంపద సృష్టి కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.



నిధుల విడుదలపై హర్షం

ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంపై ఆయా పాలకవర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. గతంలో ఇదే నిధుల కోసం రోడ్డెకి ఆందోళనలు చేస్తే అప్పటి ప్రభుత్వం తమను నిర్ధాక్షణ్యంగా అరెస్టు చేసిందని, కొంతమందిపై కేసులు కూడా పెట్టిందని పలువురు తెలిపారు. చివరకు పంచాయతీల్లో చిన్నచిన్న పనులకు నగదు లేక భిక్షాటన చేసినా నాటి పాలకుల్లో చలనం లేకుండా పోయిందన్నారు. కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే నిధులు విడుదల చేసి కునారిల్లిపోతోన్న పంచాయతీలను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నారని హర్షం వక్తం చేశారు. నిధుల విడుదలపై అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో కూడా పంచాయతీల నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు. నిధుల విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు జాస్తి కృతజ్ఞతలు తెలిపారు.




పట్టాలెక్కుతున్న.. రైల్వే ప్రాజెక్టులు

- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు
- టీడీపీ ప్రభుత్వం రాకతోనే మళ్లీ పనులు మొదలు
- 2014-19లో నడికుడి - శ్రీకాళహస్తి మార్గం పరుగులు
- అప్పట్లోనే గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రారంభం
- నేడు గుంటూరు - బీబీనగర్ రెండో మార్గం భూసేకరణ చకచకా
- త్వరలోనే అమరావతి కొత్త రైలుమార్గం నిర్మాణానికి అంకురార్పణ

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కాలన్నా.. పనులు పరుగులు తీయాలన్నా.. టీడీపీ ప్రభుత్వం ఉండాల్సిందేనా. అంటే జరుగుతున్న పరిణామాలు అవుననంటున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నడికుడి - శ్రీకాళహస్తి మార్గం, గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు గుంటూరు - బీబీనగర్ రెండో మార్గం భూసేకరణ, అమరావతి కొత్త రైలుమార్గం పనులు పట్టాలెక్కాయి. 2019 నుంచి 2024 మధ్య వైసీపీ హయాంలో రైల్వే ప్రాజెక్టులు ఊసే లేకుండా పోయింది. దీనిని బట్టి ఉమ్మడి గుంటూరు జిల్లాలో రైల్వే ప్రాజెక్టులు ముందుకు సాగాలంటే అధికారంలో తెలుగుదేశం పార్టీ ఉండాల్సిందేనని ప్రజలు భావిస్తున్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇతర అనుమతులు, రైలు మార్గాల నిర్మాణానికి వినియోగించే సామగ్రిని సమకూర్చడం వంటివి టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమని ఇటీవల ప్రారంభమైన పనులు చేస్తే ఎవ్వరికైనా అర్థం అవుతుంది. మారుమూల ప్రాంతాలకు రైలుమార్గాల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్న సిద్ధాంతాన్ని టీడీపీ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుంది. ఈ కారణంగానే కొత్త రైల్వే ప్రాజెక్టు ఏది వచ్చినా అది సాధ్యమైనంత త్వరగా ముందడుగు వేసేందుకు అను వైన వాతావరణాన్ని కల్పిస్తున్నది. 2014-19 మధ్య కేంద్రంలో ఎన్‌డీఏ, ఇక్కడ టీడీపీ ప్రభుత్వాలు ఉన్నాయి. అప్పట్లో గుంటూరు-గుంతకల్లు రెండో రైలు మార్గం, నడికుడి - శ్రీకాళహస్తి న్యూ రైల్వే లేన్ ప్రాజెక్టులు జిల్లాకు మంజూరయ్యాయి. దాంతో వాటికి అవసరమైన భూములను సేకరించి ఇచ్చే బాధ్యతను అప్పటి టీడీపీ ప్రభుత్వం కలెక్టర్‌కు అప్పగించింది. దాంతో పిడుగురాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, శావల్యాపురం, వినుకొండ తదితర మండలాల్లో భూములను సేకరించడంతో నాలుగేళ్ల క్రితమే 40 కిలోమీటర్లకు పైగా రైలు మార్గం నిర్మాణాన్ని పూర్తి చేసింది. ప్రస్తుతం గూడ్స్‌రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. త్వర లోనే ప్యాసింజర్ రైళ్లను పట్టాలెక్కించేందుకు ప్రయత్నాలు జరుగు తున్నాయి. మరోవైపు గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టుకి కూడా ప్రాధాన్యం ఇచ్చి భూములను సేకరించింది ఇచ్చింది. దీంతో ఇప్పటి వరకు నల్లమడ అటవీప్రాంతం వరకు రెండో మార్గం నిర్మాణం పూర్తి అయి రైళ్ల సమయపాలన గణనీయంగా పెరిగింది. కాగా వైసీపీ ప్రభు త్వ పాలనలో ఏ ఒక్క రైల్వే ప్రాజెక్టుకు ముందుకు సాగలేదు. కనీసం ఆర్‌వోబీ, ఆర్‌యూబీలకు కూడా మ్యాచింగ్ గ్రాంటుని విడుదల చేయలేదు.

ప్రస్తుతం చకచకా పనులు

టీడీపీ ప్రభుత్వం పరిపాలన ప్రారంభిస్తూనే గుంటూరు - బీబీనగర్ రైల్వే ప్రాజెక్టు నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే గుంటూరు జిల్లాలో 47 ఎకరాల భూమి సేకరణకు కాంపిటెంట్ అథారిటీ అయిన గుంటూరు ఆర్‌డీవో నోటిఫికేషన్ ఇచ్చారు. అలానే ఎక్కువ విస్తీర్ణంలో భూమిని సేకరించాల్సిన పల్నాడు జిల్లా పైనా దృష్టి కేంద్రీకరించింది. ఈ రైలు మార్గంలో ఎక్కువగా పల్నాడు జిల్లాలోని వివిధ మండలాల మీదగా సాగనున్నది. దీంతో సత్తెనపల్లి మం డలంలోని ధూళిపాళ్లలో 12.36, కంకరణాలపల్లెలో 7.96, సత్తెనపల్లిలో 17.15, భీమవరంలో 5.13, అబ్బూరులో 2.08, గుడిపూడిలో 4.22 ఎకరాల భూమిని సేకరించేందుకు సత్తెనపల్లి ఆర్‌డీవో ద్వారా భూసేకరణ ప్రక్రియని ప్రారంభించింది. బెల్లంకొండ మండలంలో 11.73, పెదకూరపాడు మండలంలోని పెదకూరపాడు గ్రామంలో 11.18, లింగంగుంట్లలో 12.54, చినమక్కెనలో 0.68, రాజుపాలెం మండలంలోని చౌటుపాపాయపాలెంలో 13.69, రెడ్డిగూడెంలో 13.2, కుబాత్‌పురంలో 4.83, రాజుపాలెంలో 10.25 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ విధంగా 127.01 ఎకరాలను ఈ ఏడాది ఆఖరులోపే సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకొన్నది. మరోవైపు పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల్లోనూ భూములు సేకరించాల్సి ఉండటంతో అక్కడి ఆర్‌డీవో కూడా దీనిపై దృష్టి సారించారు.



అమరావతి రాజధానికి నూతన రైలుమార్గం నిర్మాణానికి సం బంధించి ఇప్పటికే డీపీఆర్‌ని కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. ఈ ప్రాజెక్టు కోసం గుంటూరు జిల్లాలో 407.73 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నది. రైల్వే శాఖ ఎప్పుడు కోరితే అప్పుడు భూసేకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు సంసిద్ధతని వ్యక్తపరిచింది. ఈ నేపథ్యంలో రైల్వే ప్రాజెక్టులు జిల్లాలో ముందడుగు వేయాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటేనే సాధ్యపడుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతున్నది.

ఉమ్మడిగా.. రెవెన్యూ బదిలీలు

- ప్రత్యేక కమిటీని నియమించిన ప్రభుత్వం
- నోడల్ అథారిటీగా గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో ఉద్యోగుల బదిలీలు ప్రస్తుత జిల్లాల్లోనే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన కూడా జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెల 19 నుంచి 31 మధ్య బదిలీల ప్రక్రియని పూర్తి చేయాల్సిందిగా ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన చేపట్టే తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్, తత్సమాన స్థాయి అధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులు, వీఆర్‌వో గ్రేడ్-1, 2 ఉద్యోగుల బదిలీల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీకి గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నోడల్ అథారిటీగా వ్యవహరిస్తారు. పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా, మెంబర్ కన్వీనర్‌గా గుంటూరు డీఆర్‌వో ఉంటారు. ఈ కమిటీ భేటీ అయి ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది. విభజన జరిగిన జిల్లాలో జరిగే తహసీల్దార్, వీఆర్‌వో గ్రేడ్-1 ఉద్యోగుల బదిలీలను కలెక్టర్, జేసీ, డీఆర్‌వో అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీ చేపడుతున్నది. ఇక డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్‌ఐ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుల బదిలీలు జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో, కలెక్టరేట్ ఏవో కలిసి సమావేశమై చర్చించి నిర్ణయిస్తారు. తహసీల్దార్లు ఎవరైతే అంతర్ జిల్లాల బదిలీలు కోరుకుంటున్నారో వారి వివరాలను సీసీఎల్ఏకి పంపాలని ప్రభుత్వం ఆదేశించింది.



తిరుమలలో చిరంజీవి

● కుటుంబ సభ్యులతో కలసి నేడు శ్రీవారి దర్శనం

మెగాస్టార్ చిరంజీవి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి 8గంటలకు తిరుమలలోని ఫీనిక్స్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులతో పాటు అభిమానులు స్వాగతం పలికారు. చిరంజీవితో పాటు ఆయన సతీమణి సురేఖ, తల్లి అంజనా దేవి కూడా తిరుమలకు చేరుకున్నారు. అంతకుముందు సాయంత్రం కుమార్తె శ్రీజ కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో వేకువజామున జరిగే సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకోనున్నారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

ముఫాసాకు మహేశ్ వాయిస్



ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకున్న 'ది లయన్ కింగ్' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. 'ముఫాసా ది లయన్ కింగ్' పేరుతో వస్తున్న ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసాకు మహేశ్‌బాబు వాయిస్ అందిస్తుండడం ఆసక్తికరం. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్‌లో పుంబా పాత్రకు బ్రహ్మానందం, టిమోన్ పాత్రకు అలీ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ 'డిస్నీతో అనుబంధం నాకు ప్రత్యేకమైంది. తన కొడుకు అంటే అభిమానం కలిగిన పాత్ర ముఫాసా. అంతేకాదు అడవికి రారాజు. ఆ పాత్రకు నేను వాయిస్ అందించడం నా పిల్లలతో ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే సందర్భం ఇది' అన్నారు. డిసెంబర్ 24న 'ముఫాసా ది లయన్ కింగ్' విడుదలవుతుంది.



సిద్ధు కోసం శ్రీనిధి

సిద్ధు జొన్నలగడ్డ తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, తాజా షెడ్యూల్‌లో శ్రీనిధి జాయిన్ అయ్యారు. కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

బ్లాక్‌బస్టర్ పక్కా



నాని, ప్రియాంక మోహన్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్.జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషించారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ నెల 29న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చిత్రబృందం ఎంతో కష్టపడింది. ఆ కష్టం తెరపై కనపడుతుంది. వారి కోసం ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి. ఈ సినిమాకు వివేక్ రైటింగ్, జేక్స్ బిజోయ్ సంగీతం స్పెషల్ అట్రాక్షన్. నాకు కోపం వచ్చింది. అలా కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ పక్కా" అని చెప్పారు. "ఈ సినిమాలో ఎస్.జే. సూర్య, నాని పోటాపోటీగా నటించారు. వివేక్ నుంచి ఇటువంటి కమర్షియల్ సినిమా అస్సలు ఊహించలేదు. సినిమాను డైరెక్టర్ ఓ రేంజ్‌లో తీశారు" అని దిల్‌రాజు అన్నారు. "ఈ సినిమాకు కథే బలం. సినిమా అద్భుతంగా వచ్చింది" అని చిత్ర నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు.

తెలుగులోనూ ఆదరిస్తారు



హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను భయపెట్టిన 'డీమాంటి కాలనీ'కి సీక్వెల్‌గా తెరకెక్కిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్.ఆర్.జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను బి.సురేశ్ రెడ్డి, బి.మానస రెడ్డి నిర్మించారు. అరుల్‌నిధి, ప్రియా భవానీశంకర్ ముఖ్య పాత్రల్లో నటించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న ఇలాంటి సినిమాను తెలుగులోను ఆదరిస్తారు" అని చెప్పారు. "ఈ సినిమాకు కొనసాగింపుగా మరో రెండు భాగాలు ఉంటాయి" అని దర్శకుడు అజయ్.ఆర్.జ్ఞానముత్తు అన్నారు.

అద్భుతమైన కంటెంట్‌తో 'రేవు'



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా.మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రభు దర్శకత్వ పర్యవేక్షణ చేపట్టగా, పి.రాంబాబు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు హరినాథ్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. అందరూ మెచ్చే చిత్రమిది" అని అన్నారు. "ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఎగ్జైట్ అవుతారు" అని నిర్మాత డా.మురళి గింజుపల్లి అన్నారు.

SCHOLARSHIP ALERT

Reliance Foundation Undergraduate

Description: The Reliance Foundation Under graduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, be come successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Students must be enrolled in the first year of a full-time regular undergraduate (UG) de gree in any stream at a recognised Indian institute. ● Must have passed Class 12 with a minimum of 60% marks. ● The annual household income should be up to INR 15,00,000 per year (preference will be given to those students whose family income is less than INR 2,50,000)

● Open for resident Indian citizens only. An aptitude test is mandatory.

Prizes & Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RFS11

SBIF Asha

దిక్సూచి

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: **Classes 6 to 12:** INR 15,000 each

- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000

Last Date: 01-10-2024 ***Short Url:*** www.b4s.in/aj/SBIFS7

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/LAnmSIT లో చదవండి.

మాకు ప్రాణ రక్షణ కల్పించండి



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న స్కాట్ సిబ్బంది

- మంత్రి లోకేశ్ వద్ద వైసీపీ బాధితుల కన్నీటిపర్యంతం
- ఆందోళన వద్దు.. అండగా ఉంటానని మంత్రి హామీ
- 29వ రోజు ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరణ

తాడేపల్లి టౌన్, ఆగస్టు 21 : 'వైసీపీ రౌడీలు గొంతుపై కత్తిపెట్టి ఇంటిని, పొలాన్ని కబ్జాచేశారు. ఇంటిని ఆక్రమించారు. చంపుతామని బెదిరిస్తున్నారు...' అంటూ వైసీపీ బాధితులు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్ ఎదుట కన్నీటిపర్యంతం అవుతున్నారు. ఉండవల్లి నివాసంలో 29వరోజు బుధవారం జరిగిన ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్ ప్రజల నుంచి వినుతులు స్వీకరించారు.

వైసీపీ రౌడీలు తన గొంతుపై కత్తిపెట్టి ఇంటిని, పొలాన్ని కబ్జా చేశారని గుంటూరు తెనాలికి చెందిన విశ్రాంత రైల్వే డ్రైవరు పిల్లి అబ్రహాం, కుమార్తె పిల్లి సుధారాణి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేత, దుగ్గిరాల జడ్పీటీసీ దాసరి వీరయ్య, అతని అనుచరులైన రౌడీషీటర్, తెనాలి వన్ టౌన్ వైసీపీ కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర, గడ్డేటి బాలయ్య, రౌడీషీటర్ మహంకాళి, పిల్లి తిరుపతయ్య, మహేష్‌లు కలిసి వేధిస్తున్నారని కన్నీటిపర్యంతమ య్యారు. వృద్ధుడినైన తనపై దాడిచేసి చంపుతామని బెదిరిస్తు న్నారని, ఇంటిని ధ్వంసం చేసి బయటకు గెంటేశారని, వాపోయారు. దిక్కుతోచని స్థితిలో పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలే దన్నారు. పలు భూకబ్జాలు, హత్యలు సెటిల్‌మెంట్లు, కేసుల్లో ముద్దా యిలైన వైసీపీ రౌడీల బారినుంచి ప్రాణ రక్షణ కల్పించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



దివ్యాంగుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

మంగళగిరి నియోజకవర్గంలో సమస్యలిలా ...

కోవిడ్ సమయంలో భర్త చనిపోయాడని, కూలిపనులు చేసుకుని జీవనం సాగించే తనకు కుటుంబ పోషణ భారంగా మారిందని బీమా అందించడంతోపాటు ఆర్థిక సాయంచేసి ఆదుకోవాలని పెద వడ్లపూడికి చెందిన బీ.భారతి కోరారు. వైసీపీ ప్రభుత్వం తొలగిం చిన వృద్ధాప్య పెన్షన్‌ను పునరుద్దరించాలని తాడేపల్లికి చెందిన నందూరి మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. దివ్యాంగ పెన్షన్ కోసం గత ప్రభుత్వంలో పలుమార్లు దరఖాస్తు చేసిన ఫలితం లేదని, తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని యర్రబాలెం చెందిన షేక్ కరిమున్ కోరారు. ఇంటి స్థలం కేటాయించాలని మంగళగిరి కుప్పరావుకాలనీకి చెందిన ఏ.పుష్పావతి విజ్ఞప్తి చేశారు. ఐదు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న తన ఇంటికి పట్టా మంజూరు చేయాలని తాడేపల్లికి చెందిన కొమ్మినేని సాంబశివరావు కోరారు. ఆయా విన్నపాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన వినతులు ఇలా.....

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా, నారాకోడూరుకు చెందిన కోడూరు వినోద్‌కుమార్ మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. టీడీపీ సానుభూతిపరులంటూ చిత్తూరుజిల్లాలో పని చేసే పలువురు హోంగార్డులను అన్నమయ్య జిల్లాకు వెళ్లాలని గతంలో అధికారులు ఆదేశించారని సొంత జిల్లాలోనే విధులు నిర్వహించేలా తగిన ఉత్తర్వులిచ్చి న్యాయంచేయాలని హోంగార్డులు కోరారు. విజయనగరం జిల్లా కోనాడు జిల్లా పరిషత్‌పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, నైట్ వాచ్‌మెన్ సక్రమంగా విధులు నిర్వహించడంలేదని వారిని తొలగించాలని పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, సభ్యులు విజ్ఞప్తి చేశారు. టీడీపీ సానుభూతిపరులనే నెపంతో గత ప్రభుత్వంలో 14 మందిపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని విజయ నగరం జిల్లా వెల్దూరు గ్రామ సర్పంచ్ నాయన సత్యవతి కోరారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్‌లో ఏడేళ్లనుండి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయంలో పని చేసే సంక్షేమ, విద్యా సహాయకులను మాతృశాఖ అయిన సాంఘిక సంక్షేమశాఖలో విలీనం చేయడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించాలని గ్రామ వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వంశపారం పర్యంగా తనకు సంక్రమించిన 1.46 ఎకరాలను ఆన్‌లైన్ చేయడంతో పాటు పాస్ బుక్ మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గురిజేపల్లికి చెందిన వీరారెడ్డి విజ్ఞప్తిచేశారు. నకిలీ పత్రాలతో వంశపార్యంపర్యంగా వచ్చిన తమ రెండెకరాల పొలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారి జూలకంటి బుడే కబ్జా చేశాడని, విచారించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మొక్కరాల నరసమ్మ కోరారు.

ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌లో వెకేషనల్ కోర్సు పూర్తి చేసిన వారికి 11 కేవీఏ సబ్ స్టేషన్ ఆపరేటర్ పోస్టులకు అర్హత కల్పించాలని సత్యసాయి జిల్లా నిద్రగట్టకు చెందిన ఎల్‌కే. ప్రశాంత్‌కుమార్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

సత్యసాయి వాటర్ సప్లై కార్మికులకు 6 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, కార్మికులకు జీతాలు ఇవ్వడంతోపాటు ప్రాజెక్టుకు పూర్వ వైభవంకోసం చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా సత్యసాయి వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.



అవార్డులను చూపుతున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అధ్యాపకులు

వీవీఐటీకి బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు

పెదకాకాని, ఆగస్టు 21: జేఎన్టీయూకే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ వర్సిటీ నిర్వహించిన వేడుకలలో భాగంగా అనుబంధ కళాశాలలకు అందించిన పురస్కారాలలో వీవీఐటీ కళాశాలకు బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు లభించిందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం తెలిపారు. దీంతోపాటు సీనియర్ ప్రిన్సిపాల్, ఉత్తమ అధ్యాపకులుగా అకడమిక్ డీన్ డాక్టర్ కే.గిరిబాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టీ.శ్రీనివాసరావులు పురస్కారాలు అందుకున్నారని ఆయన తెలిపారు. కాకినాడలో నిర్వహించిన జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ దినోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కే.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ చేతులమీదుగా ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు గిరిబాబు, శ్రీనివాసరావు ఈ పురస్కారాలను అందుకున్నారన్నారు. అనంతరం పురస్కారాలను పొందిన అధ్యాపకులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరీ ఎస్.బదరీ ప్రసాద్, వైస్‌చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్‌లు అభినందించారు.

ఇన్‌చార్జి వీసీతో స్కిల్ సిబ్బంది భేటీ

పెదకాకాని, ఆగస్టు 21: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావుతో యునివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, సిబ్బంది బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యునివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై జరుగుతున్న కార్యక్రమాలు గురించి యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్‌కే మహమ్మద్ రఫీ, స్కిల్ కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎస్.సాయి కుమార్, వార్డెన్ ఎన్. కృపానందంలు వివరించారు. ఇందులో ముఖ్యంగా కాస్కేడింగ్ స్కిల్, ఎకో సిస్టం, స్కిల్ హబ్స్, స్కిల్ కళాశాల, స్కిల్ యూనివర్సిటీ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న స్కిల్ సైన్సెస్ కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఇన్‌చార్జి వీసీ సానుకూలంగా స్పందించి యూనివర్సిటీ కళాశాలల్లో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలకు తగిన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

23న జాబ్‌మేళా

గుంటూరు (విద్య), ఆగస్టు 21: గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి జిల్లా పరిధిలోని జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కే.రఘు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పది నుంచి డిగ్రీ, పీజీ పూర్తయి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు గుంటూరు గుజ్జనగుండ్లలోని కాపూరి కాంప్లెక్స్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం 9866822697లో సంప్రదించాలని సూచించారు.



సత్తెమ్మ అమ్మవారు, దుండగులు పగల గొట్టిన హుండీ

అటవీ ప్రాంతంలోని ఆలయంలో చోరీ

- నాలుగు హుండీలలో నగదు, ఆభరణాలు అపహరణ

అచ్చంపేట, ఆగస్టు 21 : మండలంలోని మాదిపాడు అటవీ ప్రాంతంలో వేంచేసి ఉన్న సత్తెమ్మ అమ్మవారి నాలుగు హుండీలు, అమ్మవారి మెడలోని బంగారు నగలను దొంగలు దోచుకు వెళ్లిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దేవస్థానంలోకి ప్రవేశించి, ముందుగా అక్కడి సీసీ కెమేరాలను ధ్వంసం చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాలుగు హుండీలను, అమ్మవారి మెడలో విలువైన మంగళసూత్రాలతో పాటు తలపైవున్న వెండి కిరీటాలు, పలు ఆభరణాలు దోచుకెళ్లారు. సమీప ఎర్రవాగు ప్రాంతంలో హుండీలు పగల గొట్టి నగదును కొల్లగొట్టారు. బుధవారం యధావిధిగా ఆలయ పూజారి, సిబ్బంది పూజారి దేవస్థానం వద్దకువచ్చి తలుపులు తెరవగానే హుండీలు, అమ్మవారి మెడలోని మంగళసూత్రాలు లేక పోవటంతో స్థానిక ఏహోకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆలయ పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేసి హుండీలను స్వాధీనం చేసున్నారు. ఆలయంలో ఇలాంటి ఘటన జరగటం ఇదే మొదటిసారి. ఆలయంలో చోరీకి గురైన సొత్తు మొత్తం సుమారు రూ.10 లక్షలకు పైగా ఉంటుందని భక్తులు తెలిపారు. దేవస్థానం వద్ద రాత్రి వాచ్‌మెన్ లేకపోవటంతోనే ఈ చోరీ జరిగిందని, ఇందుకు ఆలయ అధికారుల నిర్లక్ష్యమే కారణమని భక్తులు మాట్లాడుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కేంద్రీయ విద్యాలయంలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

సెప్టెంబరులో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

- చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, ఆగస్టు 21 : ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయ శాశ్వత భవనాలను సెప్టెంబరులో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని ఇర్లపాడు గ్రామపరిధిలో నిర్మాణంలో వున్న కేంద్రీయ విద్యాలయ భవననిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పుల్లారావు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వలనే నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయన్నారు. కేంద్రీయ విద్యాలయాలు ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యార్థులకు బోధనను అందిస్తున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గణపవరంలో తాత్కాలిక భవనాల్లో తరగతులను ప్రారంభించామన్నారు. నర్సరీ నుంచి ఇంటర్ వరకు విద్యా బోధన జరిగే ఈ విద్యాలయంలో 49 తరగతి గదులను నిర్మించారన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల కన్నా విద్యా బోధనలో కేంద్రీయ విద్యాలయం మొదటిస్థానంలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఫణీంద్ర, టీడీపీ నేతలు సత్యనారాయణ, గంగా శ్రీనివాసరావు, హనుమంతరావు, నాగేశ్వరరావు, జయ ప్రసాదు, నాగ పూర్ణచంద్రరావు, సురేష్, ఉపేంద్ర, సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గురజాల అదనపు జిల్లా కోర్టు ఏపీపీ తొలగింపు

గుంటూరు(లీగల్), ఆగస్టు 21: గురజాల అదనపు జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న బారెడ్డి నాగిరెడ్డిని ఆ పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పలు కేసుల్లో నాగిరెడ్డి ఉద్దేశపూర్వకంగా కోర్టులో దాఖలైన కొన్ని పిటీషన్‌ల గురించి పోలీసులకు సమాచారం అందించలేదని, కోర్టుకు నిజాలు చెప్పకుండా దాచి నిందితులు కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందేందుకు సహకరించాడని, ఇందుకుగాను నాగిరెడ్డిని ఆ పదవి నుంచి తొలగించి మరొకరిని నియమించాలని కోరుతూ పల్నాడు జిల్లా ఎస్పీ జూన్ 18న ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై దర్యాప్తు జరిపిన ప్రాసిక్యూషన్ విభాగం పల్నాడు జిల్లా ఎస్పీ చేసిన ఆరోపణలలో వాస్తవం ఉందని తేల్చింది. నాగిరెడ్డి ప్రాసిక్యూషన్ వ్యవస్థ పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించాడని, తన వ్యవహార శైలితో ప్రాసిక్యూషన్ వ్యవస్థనే ఇబ్బందికరమైన పరిస్థితుల్లోకి తీసుకువెళ్లాడని, అతన్ని విధుల్లో కొనసాగిస్తే వ్యవస్థనే సవాల్‌చేసే పరిస్థితి ఉత్పన్నం కావచ్చని పేర్కొంటూ రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శికి ప్రాసిక్యూషన్ డైరెక్టర్ జూలై 4న నివేదిక ఇచ్చారు. దీంతో నాగిరెడ్డిని ఏపీపీ పదవి నుండి తొలగిస్తూ రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల ధ్వంసం కేసులతో పాటు పలు కేసుల్లో నాగిరెడ్డి వైసీపీ వర్గీయులకు కొమ్ముకాస్తూ నిందితులుగా ఉన్న వారిని కేసుల నుంచి బెయిల్ పొందేందుకు తన వంతు సహకారం అందించాడని అతనిపై పలు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ హయాంలో నియమితులై ఆ పార్టీ వారికి కొమ్ము కాస్తూ కోర్టుల్లో వ్యవహరిస్తున్న మరికొంతమంది టెన్యూర్ ఏపీపీలతో పాటు రెగ్యులర్ ఏపీపీల వ్యవహార శైలిపై కూడా పోలీసు శాఖతో పాటు రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ కార్యాలయం దృష్టిసారించినట్లు తెలిసింది.

52,234 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 53,961 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 52,234 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 24,572 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7000	17500	334	8500	17000
నెంబరు. 5	9000	13000	నెంబరు. 5	9000	13000
273	9000	12500	273	–	–
341	8000	16500	341	8500	17000
4884	10500	11000	4884	9500	16500
సూపర్ 10	--	--	సూపర్ 10	10000	11500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18800	తేజ	8000	18500
బ్యాడిగి	8000	17000	బ్యాడిగి	9000	13500
దేవనూరు డీలక్స్	8700	13500	దేవనూరు డీలక్స్	9000	13000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 21: నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం బుధవారం నాటికి 589.20 అడుగులు ఉంది. ఇది 309.65 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,826 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 47,650 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 26845 క్యూసెక్కులు

- టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో 1.0615 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,ఆగస్టు 21: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 2 యూనిట్ల ద్వారా 1.0615 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కే.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. రెండు గేట్లను 1.5 మీటర్, ఒక గేట్‌ను మీటర్ మేర ఎత్తి 18419, టేల్‌రేస్ చానల్ ద్వారా 8426 మొత్తం 26845 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్ నుంచి 29 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్‌లో నీటిమట్టం 75.42 మీటర్లు ఉండగా, అది 7.025 టీఎంసీలకు సమానమని తెలిపారు.

బ్యారేజి దిగువకు 21,900 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 21: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 39వేల 544 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జెఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 30 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 21 వేల 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 644 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.



బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ రజక వృత్తిదారుల సంఘం నాయకులు

రజకుల ఆర్థికాభ్యున్నతికి కృషి చేయండి

- సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య

తాడేపల్లి, ఆగస్టు 21: ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి బడ్జెట్ ద్వారా నిధులు కేటాయించి ఆ నిధులను రజకుల ఆర్థిక అభ్యున్నతికి వినియోగించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలోని కొలనకొండలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి సవితను కలిసి రజక వృత్తిదారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇస్త్రీ చేస్తున్న రజక వృత్తిదారులకు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 200 యూనిట్లు ఉచిత కరెంటు వెంటనే మంజూరు చేయాలని, అలాగే పట్టణ కేంద్రాల్లో వృత్తిదారులకు అధునాతనమైన యంత్రాలతో మోడ్రన్ ధోబీ ఘాట్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి, వాటి అమలుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటి సభ్యులు బొజ్జ సుబ్బారావు, దావులూరి శ్రీనివాసరావు, నూతక్కి నాగేశ్వరరావు, మోర్తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వహణ భేష్

- ఫౌండేషన్‌లో పంపిణీ మానిటరింగ్ మెకానిజం బాగుంది
- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి



అక్షయ పాత్రను పరిశీలిస్తున్న కలెక్టరు నాగలక్ష్మీ

మంగళగిరి సిటీ, ఆగస్టు 21: అక్షయపాత్ర ఫౌండేషన్ వారి వంట తయారీ విధానం చాలా బాగుందని గుంటూరుజిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. మంగళగిరి మండలం ఆత్మకూరు వద్ద వున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌ను కలెక్టరు ఎస్.నాగలక్ష్మీ బుధవారం సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్న భోజనం తయారీ ఆధునిక పరికరాలను ఆమె పరిశీలించారు. భోజనం హైజెనిక్‌గా ఆహార పదార్థాలను తయారు చేసే విధానాన్ని ఆపరేషన్స్ మేనేజరు శ్రీహరి కలెక్టరు నాగలక్ష్మికి వివరించారు. అనంతరం కలెక్టరు విలేకరులతో మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్‌ద్వారా తెనాలి, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లోని 311 పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని అందించడంతో పాటు ఈ నెల 16వ తేదీ నుంచి అన్న క్యాంటిన్లకు కూడా ఇక్కడినుంచి ఆహారం సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఒక లక్ష మందికి భోజనం తయారు చేయడానికి అవసరమైన అత్యాధునిక వంట సామగ్రి ఇక్కడ అందుబాటులో వుందన్నారు. తయారైన ఆహార పదార్థాలను సకాలంలో జాబితా ప్రకారం అన్ని ప్రాంతాలకు పంపిణీ చేసేందుకు మానిటరింగ్ మెకానిజం బాగా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనరు అలీమ్ బాషా, డీఎస్వో కోమలి పద్మ, మార్కెటింగ్ ఏడీ రాజాబాబు, మంగళగిరి తహసీల్దారు సుభానీ అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాటి దుర్ఘటన జరిగి నేటికి 25 ఏళ్లు..

- గోలివాగులో 10 మంది జల సమాధి



ఉధృతంగా ప్రవహిస్తున్న గోలి వాగు (ఫైల్)

రెంటచింతల,ఆగస్టు 21 : సరిగ్గా పాతికేళ్ల క్రితం ఇదే రోజు.. భారీ వర్షాలు కురుస్తున్నాయి. గృహాలోంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. గోలి వాగు మహోధృతంగా ప్రవహిస్తుంది. లోలెవెల్ చపా మీద నుంచి వాహనాలు వెళ్లడం అంతంత మాత్రమే. అయితే ఒకటి రెండు లారీలు వాగు దాటి ఆవలి ఒడ్డుకు చేరాయి. మాచర్లలో వివాహానికి హాజరయ్యేందుకు 10 మంది సుమో వాహనంలో గురజాలలో బయలుదేరి గోలి వాగు దగ్గరకు వచ్చారు. వాగు దాటే పరిస్థితి లేదు. అందులో ఓ పెద్దాయన ముందు వెళ్లిన లారీ వాళ్లను అడిగి మోకులు(తాళ్లు) తీసుకొండి.. సుమోకు కట్టి వెళ్దాం.. పెళ్లికి టైమౌతోందని ఉచిత సలహా ఇచ్చాడు.. డ్రైవర్ మణి మోకులు తెచ్చి సుమోకి కట్టి వాగు మీద నుంచి లాగిస్తున్నారు. కొంత దూరం వెళ్లగానే తాళ్లు తెగిపోయాయి. సుమో నీళ్లలో కొట్టుకుపోయింది. 10 మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటనకు నేటికి 25 ఏళ్ల (2000 ఆగస్టు 22).

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 21 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు రవిప్రదీప్‌తో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల వ్యతిరేక కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నపిల్లలు చదువుపై శ్రద్ధ చూపించాలన్నారు. ఆటపాటలతో సరదాగా గడపాల్సిన బాల్యాన్ని వెట్టి చాకిరితో గడపటం చాలా బాధాకరమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు బాల కార్మిక వ్యవస్థను వ్యతిరేకించి స్వేచ్ఛ ప్రపంచంలో బాలబాలికలు ఉండేవిధంగా చూడాలన్నారు. బాల్యవివాహాలను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లం గోపికృష్ణ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు, ఉచిత ఇసుక విధానంపై వీడియోకాన్ఫరెన్స్



సమావేశంలో కలెక్టర్ జె.వెంకటమురళీ, జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

బాపట్ల, ఆగస్టు 21 : గ్రామసభలు, ఉచిత ఇసుక విధానం అమలుపై కలెక్టర్లతో రాష్ట్రముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉచిత ఇసుక విధానం ఈనెల 23 నుంచి జరిగే గ్రామసభలు గురించి ఆయన పలుసూచనలు చేశారు. బాపట్ల నుంచి సమావేశానికి కలెక్టర్ జె.వెంకటమురళీ, జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీవో

కర్లపాలెం, ఆగస్టు 21 : గ్రామంలో ఓటర్ల జాబితాపై పక్కా సర్వే నిర్వహించాలని బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ అన్నారు. మండలంలోని యాజలి గ్రామంలో ఓటర్ల జాబితాపై ఇంటింటికి సర్వే జరుగుతున్న తీరును తహసీల్దార్ వెంకటరత్నంతో కలిసి బుధవారం ఆర్డీవో రవీందర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటరత్నం మాట్లాడుతూ కుటుంబ సభ్యుల ఓట్లు అన్ని ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేవిధంగా చేర్చాలన్నారు. ఓటర్లు రెండు, మూడు ఓట్లు, డెత్‌లు తదితర విషయాలన్నిటిని సెప్టెంబరు 20 నుంచి అక్టోబరు 28 వరకు మండలంలోని వీఆర్వోలు అందరు ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించి అక్టోబరు 20న ముసాయిదా జాబితా ప్రచురణ చేస్తారని తహసీల్దార్ వివరించారు.



యాజలిలో ఇంటింటికి ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రవీందర్, తహసీల్దార్ వెంకటరత్నం

అస్థవ్యస్థంగా అంగన్‌వాడీ కేంద్రాలు : తహసీల్దార్

కర్లపాలెం, ఆగస్టు 21 : మండలంలోని బుద్దాం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలు అస్థవ్యస్థంగా ఉన్నాయని తహసీల్దార్ ఎస్.వెంకటరత్నం అన్నారు. మండలంలోని బుద్దాం సచివాలయం పక్కన ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటరత్నం బుధవారం పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్‌లను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి రెండురోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాలన్నింటిని పరిశీలించి నివేదికలు అందజేయాలని సూచించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మండలంలో అస్థవ్యస్థంగా ఉందని, చిన్నారులకు మెరుగైన సేవలందించటానికి అంగన్‌వాడీ కార్యకర్తలు ఖచ్చితంగా పనిచేయాలని, మెరుగైన సేవలందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి తహసీల్దార్ సూచించారు.

చేతులు శుభ్రంగా సబ్బుతో కడగాలి

● జిల్లా కో ఆర్డినేటర్ రంగారావు

కర్లపాలెం, ఆగస్టు 21 : భోజనం చేయటానికి ముందు, మలవిసర్జనకు వెళ్ళి వచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని, వేడిగా ఉన్న పౌష్టికాహారాన్ని తినాలని, ఈగలు వాలిన ఆహార పదార్థాలను తినరాదని జలజీవన్‌మిషన్ డీపీఎం జిల్లా కోఆర్డినేటర్ టి.రంగారావు అన్నారు. కర్లపాలెంలోని జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో డయేరియాపై జలజీవన్‌మిషన్ డీపీఎం ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్ అధ్యక్షతన బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డయేరియా పై అవగాహన ర్యాలీని విద్యార్థులతో కలిసి కర్లపాలెంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రదీప్, హనుమంత రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు, వైద్య, ఆరోగ్యసిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి : ఏవో

కర్లపాలెం, ఆగస్టు 21 : మండలంలోని రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ అన్నారు. మండలంలోని పేరలిలో జీఏపీ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమంత్‌కుమార్ రైతులకు పంటను ఆశించే తెగుళ్ళు, నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



కాల్వ నిండుగా నీరు... చి'వరి' భూములకు అందని వైనం

● సముద్రతీర ప్రాంత రైతుల ఆందోళన

బాపట్ల, కర్లపాలెం, ఆగస్టు 21 : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం మండలాలకు సాగునీరు అందించే ప్రధాన కాల్వ ఫిటి ఛానల్‌లో నీరునిండుగా ప్రవహిస్తున్నది. అయినప్పటికీ నీరు చివరి భూములకు అందటం లేదు. దీనివల్ల తీరప్రాంత గ్రామాలలోని వరి పైర్లు ఎండుముఖం పట్టటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓవైపు వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. చివరి భూములకు నీరు రాక వెదపెట్టిన పొలాలు కాస్త ఎండిపోతున్నాయి. గత ప్రభుత్వం నాలుగు సంవత్సరాల కాలంలో పంట కాల్వలను పర్యవేక్షించకపోవటం, కాల్వల మరమ్మతులు చేపట్టకపోవటం, కాల్వలను ఆధునీకరించకపోవటం కారణంగా తీరప్రాంత గ్రామాల దరికి సాగు నీరు చేరటం లేదు. గతనెలలో విస్తారంగా వర్షాలు కురవటంతో రైతులు ఈ ఏడాది పెద్ద ఎత్తున వెదసాగు చేపట్టారు. పైరు ఆశాజనకంగా ఉన్నప్పటికి ప్రస్తుతం నీరు లేక, వర్షం కురవక పైరు కాస్త ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ భూములలో విత్తిన పైరు కొంత ఆశాజనకంగా ఉంది. కొన్నిచోట్ల నీరు పెట్టి ఎండిన వెదపైరు దమ్ము చేసి నాట్లు వేసేందుకు సిద్ధపడుతున్నారు. సముద్ర తీర గ్రామాలలో మాత్రం ఇంకా నీరు వస్తుందని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఫిటి ఛానల్‌లో 120 క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉంది. దీనిప్రకారం కొద్దిరోజులుగా 120 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు సరఫరా చేస్తున్నారు. అయినప్పటికి నీటి ప్రవాహంలో అనేక అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఎగువ భూముల రైతులు పొలాలకు అవసరానికి మించి నీరు పెడుతున్నారని దిగువ భూముల రైతులు ఆరోపిస్తున్నారు. మరికొందరు కాల్వలు మరమ్మతులు చేయకపోవటం వల్ల ఎగువ ఉన్న షట్టర్‌లు, తూములు మూసివేసిన నీరు చివరికి రావటం లేదంటున్నారు. ఫలితంగా బాపట్ల మండలంలోని కప్పలవారిపాలెం, పిన్నిబోయనవారిపాలెం, కర్లపాలెం మండలంలోని కట్టవాద, పెదపులుగువారిపాలెం, పేరలి, పేరలిపాడు, తుమ్మలపల్లి, నర్రావారిపాలెం, పెదగొల్లపాలెం పరిసర ప్రాంతాలలోని పొలాలకు నీరు అందటంలేదు.



కట్టవాదలో ఎండిపోతున్న వెదపెట్టిన వరి పైరు



ఫిటిఛానల్‌లో నిండుగా ప్రవహిస్తున్న నీరు

పర్యవేక్షించిన ఇరిగేషన్ అధికారులు

సముద్రతీరప్రాంత గ్రామాల పొలాలకు సాగునీరు అందటంలేదని రైతులు ఆందోళన చేయటంతో ఇరిగేషన్ డీఈ రామ్మూర్తి సిబ్బందితో కలిసి బుధవారం పర్యవేక్షించారు. ఫిటి ఛానల్ పొడువున పరిశీలించి దిగువ భూముల రైతులకు పలు సూచనలు చేశారు. ఎగువ భూముల రైతులకు నచ్చజెప్పి తూములు, షట్టర్‌లు కొద్దిరోజులు మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. సకాలంలో కాంట్రాక్టర్ ముందుకొచ్చి పనులు చేయకపోవటం వల్ల కేవలం తూటి, తుంగ తొలిగించి నీటిని విడుదల చేయటం జరిగిందని డీఈ తెలిపారు. నీటి పరిమాణం పెంచి ఇస్తే గండులు పడే ప్రమాదం ఉందన్నారు. అయినప్పటికి రైతుల ఇబ్బందుల దృష్ట్యా పూర్తి స్థాయి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. 120 క్యూసెక్కుల నీరు ఇవ్వటం జరిగిందన్నారు. కొద్దిరోజులు రైతులంతా సహకరిస్తే అన్నిప్రాంతాల రైతులకు సాగునీటి సమస్య లేకుండా చూస్తామని డీఈ రామ్మూర్తి తెలిపారు.

భావ ప్రకటనకు కవిత్వం గొప్ప సాధనం : రావూరి

బాపట్ల, ఆగస్టు 21 : భావ ప్రకటనకు భాష ఒక సాధనమని, కవిత్వం ఇంకా గొప్ప సాధనమని, ఏదైన ఒక విషయాన్ని మాటగా కన్నా కవిత్వంగా చెపితే మనసు హత్తుకుపోతుందని సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్, సాహితీభారతి కోశాధికారి ఆదంషఫి అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవ సభలో బుధవారం వారు మాట్లాడుతూ కవిత్వానికి సంగీతం తోడైతే పాటగా మారి చెవులకు ఇంపుగా మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తుందని, 1999వ సంవత్సరం ప్యారిస్‌లో యునెస్కోవారి 30వ సమావేశంలో ఆగస్టు 21వ తేదిన ప్రపంచ కవితా దినోత్సవంగా ప్రకటించారని అన్నారు. కార్యక్రమంలో మర్రి మాల్యాద్రిరావు, కె.కాళీదాసు, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వేద పాఠశాలకు నిత్యావసరాలు పంపిణీ

బాపట్ల, ఆగస్టు 21 : ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలలో భాగంగా బుధవారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామంలోని శ్రీ శంకర విద్యాలయం వేదపాఠశాల విద్యార్థులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. చిరంజీవియువత జిల్లా అధ్యక్షుడు విష్ణుమొలకల చంద్రమోహన్ ఆధ్వర్యంలో వేద విద్యార్థులకు అందజేసి చిరంజీవి నూరేళ్ళు ఆరోగ్యంగా ఉండాలని వేదమంత్రాలతో ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పడమటి ధర్మారావు, గుండా శ్రీనివాసరావు, మాడా రామకృష్ణ, సంగీత ఏసోబు, ఇక్కుర్తి శ్రీనివాసరావు, వేదపాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం : పట్టణ సీఐ

బాపట్ల, ఆగస్టు 21 : హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పట్టణంలో బుధవారం విస్తృతంగా వాహనాల తనిఖీ చేశారు. గడియారస్తంభం సెంటర్ కూడలిలో హెల్మెట్ వాడకం, ర్యాష్ డ్రైవింగ్‌పై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పొల్యూషన్ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై సుధాకర్, పట్టణ ఎస్ఐలు ఎం.విజయ్‌కుమార్, టి.రవి కుమార్, హెడ్ కానిస్టేబుల్ విక్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఘనసన్మానం

బాపట్లరూరల్, ఆగస్టు 21 : జవహర్‌లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్సిటి కాకినాడ విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం కాకినాడలో ఏర్పాటు చేసిన సభలో బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఛైర్మన్, ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు చేతులమీదగా సీనియర్ ప్రిన్సిపాల్ విభాగంలో సన్మానం అందుకోవటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీఅధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, వైస్‌ప్రెసిడెంట్‌లు డి.రామ్మోహనరావు, జి.దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కె.హరిపద్మప్రసాద్, ట్రెజరర్ టి.రామకృష్ణారావులు ప్రిన్సిపాల్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

పాతనందాయపాలెంలో శ్రీ పెదఅంకమ్మతల్లి ఊరేగింపు

కర్లపాలెం, ఆగస్టు 21 : మండలంలోని పాతనందాయపాలెంలో నూతనంగా నిర్మాణం చేసిన దేవాలయంలో కుంచాలవారి ఇలవేల్పు శ్రీ పెదఅంకమ్మతల్లిని, పలు దేవతామూర్తులను ఈనెల 22వ తేదీన ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా శ్రీ పెదఅంకమ్మ తల్లి విగ్రహాన్ని పాతనందాయపాలెం పురవీధులలో భారీ మేళతాళాలతో, కనకతప్పెట్లతో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగించారు. ఆలయం ఎదుట హోమాన్ని నిర్వహించారు. కుంచాల నాగిరెడ్డి దంపతులు, కుంచాల ఇంటిపేరు గల పెద్దలు పూజా కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థికసాయం

కర్లపాలెం, ఆగస్టు 21 : మండలంలోని పేరలిపంచాయతీ పాతపాలేనికి చెందిన దాసి యోహాను మృతి చెందటంతో పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ పేరలి బాలకృష్ణమూర్తి సహకారంతో టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, నాయకులు గేరా ఏసుబాబు ఆధ్వర్యంలో మృతుని కుటుంబ సభ్యులకు రూ.5 వేల నగదును బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాగిత విజయరాజు, దేవరంపాటి రాజా, మద్దిబోయన బుల్లియ్య, జోగి రాజేష్, దాసరి రత్నరాజు, జోగి పసి, జోగి సురేష్, షేక్ జానీబాషా, షేక్ సుభానీ, దేవరంపాటి రవీంద్ర పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

కొల్లూరు, ఆగస్టు 21 : మండల పరిధిలోని దోనేపూడిలో చర్చి నిర్మించుకున్న తన సొంత స్థలం తమకు చెందినదని, వెంటనే ఖాళీ చేయాలని తాను చర్చిలో ఉన్న సమయంలో తనపై కొందరు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఎం.జయరాజ్ ఫిర్యాదు చేశారు. జయరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెనాలికి చెందిన సుద్దపల్లి నాగరాజుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు బుధవారం తెలిపారు.

మత్స్య కార్మికులను ప్రభుత్వం అన్ని విధాల అదుకోవాలి

రేపల్లె, ఆగస్టు 21 : మత్స్య కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న సీఆర్జ్ చట్టాన్ని వెనక్కు తీసుకునే వరకు మత్స్య కార్మికులు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగాంజనేయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని రింగ్‌రోడ్ సెంటర్‌లో బుధవారం మత్స్య కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర తీరం వెంట 500 మీటర్ల వరకు ఉన్న భూమిలో మత్స్య కార్మికుల జీవనోపాధి కోసం మడ అడవుల పెంపకం, రొయ్యలు, చేపల చెరువుల సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కోస్టల్ రెగ్యులేషన్ జోన్ పేరుతో కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ 50 మీటర్లకు కుదించిందని, దీనివల్ల మత్స్య కార్మికుల జీవనోపాధికి విఘాతం కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో చేతి వృత్తిదారుల రాష్ట్ర సమాఖ్య ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ, నాయకులు ఎ.మల్లేశ్వరమ్మ, కె.సుబ్బారావు, విశ్వనాథపల్లి వీరరాఘవయ్య, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, చిప్పల వీరరాఘవయ్య, కొడాలి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగాంజనేయులు

సచివాలయ భవనాన్ని పరిశీలించిన పంచాయతీరాజ్ శాఖ అధికారి


భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 21 : కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ భవనాన్ని పంచాయతీరాజ్ శాఖ అధికారి పరిశీలన చేశారు. భట్టిప్రోలు మండల పరిధిలోని ఐలవరం గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సచివాలయ భవనాన్ని త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఐలవరం గ్రామ సచివాలయం-1లో, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభలు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు ఓడీఎఫ్ ప్లస్ సర్వే, పల్స్ సర్వే తదితర అంశాలపై సూచనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి రవికుమార్

డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపు

రేపల్లె, ఆగస్టు 21 : తీర ప్రాంతంలోని డ్రెయిన్లలో తూటికాడ తొలగింపునకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో బుధవారం శ్రీకారం చుట్టారు. నిజాంపట్నం మండలం కూచినపూడి పరిసర ప్రాంతాలలో డ్రెయిన్లు, పంటకాల్వలలో పూడికతీత పనులను ప్రారంభించారు. నాలుగు సంవత్సరాలుగా గత ప్రభుత్వ అధికారులు డ్రెయిన్లలో పూడికలు తీయకపోవటంతో చివరి భూములకు సాగునీరు వెళ్ళే పరిస్థితి లేకపోవటంతో రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయిన్లు గుర్రపు డెక్కతో పూడిపోవటంతో వర్షపు నీరు బయటకు వెళ్ళే పరిస్థితి లేదు. మంత్రి అనగాని ఆదేశాలతో కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతులు ప్రారంభించారు.



కూచినపూడి డ్రెయిన్‌లో తూటికాడ తొలగిస్తున్న చిత్రం

ఉచిత పశు వైద్యశిబిరం



పశువైద్యశిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ హనుమంతరావు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 21 : మండలపరిధిలోని జీఎస్‌పాలెం గ్రామ పంచాయతీలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద గర్భకోశ వ్యాధులపై బుధవారం ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ హనుమంతరావు పాల్గొని పశుసంవర్ధకశాఖ ప్రాధాన్యత కార్యక్రమాలను రైతులకు వివరించి తగు సూచనలు చేశారు. డాక్టర్ కిరణ్ పశువులను పరిశీలించి వైద్యసేవలందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏరియా పశువైద్యశాల ఏడీ డాక్టర్ చలపతిరావు, డాక్టర్ నరేంద్ర, బాపట్ల డివిజనల్ పశువైద్యాధికారి కిరణ్, పిట్టలవానిపాలెం, కర్లపాలెం విఎస్‌లు డాక్టర్ రేచల్ దివ్య, డాక్టర్ వనజ, మండలంలోని వివిధ పశువైద్యశాలలకు చెందిన అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాపట్ల-గుంటూరు రోడ్డు అభివృద్ధి చేయాలి

● కాంతిలాల్ దండేను కలిసిన ఎంపీ తెన్నేటి



కాంతిలాల్ దండేకు వినతిపత్రం అందజేస్తున్న బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, ఆగస్టు 21 : దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకొని బాపట్ల-గుంటూరు రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ బుధవారం ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరి కాంతిలాల్ దండేను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంగా, పార్లమెంట్ నియోజకవర్గంగా ఉన్న బాపట్ల నుంచి గుంటూరు రావటానికి 2 గంటలకు పైగా సమయం పడుతుందని ఆయన వివరించారు. రోడ్డు సరిగ్గా లేక వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందని చెప్పారు. అత్యవసర సమయాలలో ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రయాణికులు పడరానిపాట్లు పడుతున్నారన్నారు. ఎంతోకాలంగా సమస్య ఉన్నప్పటికీ గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. బాపట్ల-గుంటూరు రోడ్డును విస్తరించి అభివృద్ధి చేయాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కోరారు.

సీ ఫుడ్స్ కంపెనీ ద్వారా పంటపొలాల్లో కలుషిత నీరు

● గ్రామస్థులు ఫిర్యాదుతో విచారణ చేపట్టిన అధికారులు



కంపెనీ నుంచి వచ్చిన కెమికల్ నీటి శాంపిల్స్‌ను సేకరిస్తున్న పొల్యూషన్ ఏఈ భాస్కర్ వర్మ

రేపల్లె, ఆగస్టు 21: రొయ్యల వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజల ఆరోగ్యాలు క్షీణించటంతో గ్రామస్తులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు బుధవారం నిజాంపట్నం మండలం దిండి గ్రామంలో ఈస్ట్‌కోస్ట్ మెరైన్ సీఫుడ్స్ కంపెనీ పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. రొయ్యల వ్యర్థాల కారణంగా, కెమికల్స్ వాడటం వలన దుర్వాసన, విషవాయువులు రావటంతో నీరు కలుషితమై ఆ నీరు పంట పొలాల్లో కలవటంతో ప్రజల ఆరోగ్యాలు క్షీణించపోవటంతోపాటు పంట పొలాలు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు పొల్యూషన్ అధికారుల ముందు వాపోయారు. రెండు సంవత్సరాలుగా ఈస్ట్ కోస్ట్ కంపెనీని తీసివేయాలంటూ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా గత పాలకుల అండదండలతో కంపెనీ ఉందని, ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి తక్షణమే కంపెనీని మూసివేయాలని డిమాండ్ చేశారు. పొల్యూషన్ ఏఈ భాస్కర్‌వర్మ కంపెనీని పరిశీలించి, వ్యర్థాలు, కెమికల్ నీటిని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహించి వచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కంపెనీపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ బంద్ ప్రశాంతం



భారత్ బంద్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

బాపట్ల, ఆగస్టు 21 : ఎస్సీ ఎస్టీ వర్గీకరణను నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్ బాపట్లలో ప్రశాంతంగా ముగిసింది. దళిత సంఘాల నాయకులు ఉదయం నుంచే పట్టణంలోని ప్రధాన వీధులలో ర్యాలీ చేస్తూ బంద్‌కు సహకరించాలని కోరారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, పాఠశాలలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక మాట్లాడుతూ దళితుల ఐక్యతే ముద్దు.... వర్గీకరణ వద్దు అనే నినాదంతో నియోజకవర్గంలో దళిత ప్రజాసంఘాల నాయకులంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చారన్నారు. బంద్‌లో పాల్గొని కోర్టుతీర్పును వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దామన్నారు. దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు తురిమెళ్ళ అమ్మేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల విద్యార్థులు ఉద్యోగావకాశాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, దగ్గుమల్లి శ్రీకార్, రేగులగడ్డ చంద్రశేఖర్, సలగల చంటిబాబు, గొర్రెముచ్చు వందనం, కె.ఏసోబు, బుర్రా నాగమల్లేశ్వరరావు, జైభీమ్‌రావు భారత్ పార్టీ నాయకులు పర్రె కోటయ్య, కొచ్చెర వినయ్‌రాజు పాల్గొన్నారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీసులు పట్టణంలో భారీ బందోబస్తు నిర్వహించారు. పట్టణ, రూరల్ సీఐలు ఆర్.అహ్మద్‌జానీ, గంగాధరం సిబ్బందితో కలిసి ప్రధాన కూడళ్ళలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

● కర్లపాలెం, ఆగస్టు 21 : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ కర్లపాలెంలోని అంబేద్కర్ సేవాసమాజం గౌరవాధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్ ఆధ్వర్యంలో దళిత యువకులు బుధవారం కర్లపాలెంలో బంద్ నిర్వహించారు. కర్లపాలెం మండలంలోని పలు పాఠశాలలను మూసివేయించారు. బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ కర్లపాలెం పోలీసులను అప్రమత్తం చేసి కర్లపాలెం సెంటర్‌లో పహారా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

● వేమూరు, ఆగస్టు 21 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో వేమూరులో బంద్ నిర్వహించారు. యువకులు భారీ ర్యాలీ నిర్వహించి వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను మూసి వేయించారు. అనంతరం కొద్దిసేపు వేమూరు మెయిన్ రోడ్డులో రాస్తారోకో చేస్తూ సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుస్సా నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు రాష్ట్రాలకు రిజర్వేషన్లు వర్గీకరణ చేసుకునే అవకాశం కల్పించడం సముచితం కాదన్నారు. ఆయనతో పాటు కార్డు సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మధుర శ్రీనివాసరావు, చావలి మాజీ ఎంపీటీసీ సునీల్, తలతోటి సువర్ణరాజు, బాబి, కట్టుపల్లి రవీంద్ర, కంచర్ల అశోక్, పీక రాము, కట్టుపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

● కొల్లూరు, ఆగస్టు 21 : సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు చేపట్టిన బంద్ బుధవారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. కొల్లూరు మండల పరిధి గ్రామాల్లోని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలను మాల మహానాడు కార్యకర్తలు, ఎస్సీ నాయకులు, కార్యకర్తలు మూయించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 21 : సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ తలపెట్టిన బంద్ బుధవారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. మండల పరిధి గ్రామాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలను ఎస్సీ నాయకులు, కార్యకర్తలు మూయించివేశారు. చావలి సెంటర్, రథం సెంటర్‌లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● పిట్టలవానిపాలెం, ఆగస్టు 21 : ఎస్సీ ఎస్టీల వర్గీకరణను నిరసిస్తూ భారత్ బంద్‌కు మద్దతుగా బుధవారం మండలంలోని అల్లూరు గ్రామంలో ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. పలుచోట్ల దుకాణాలు, పాఠశాలల, బ్యాంక్‌లను మూయించారు. మండలంలోని అల్లూరు, ఖాజీపాలెం, చందోలురెడ్డిపాలెం తదితర గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

గ్రామ సభలను జయప్రదం చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 21 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించాలని భట్టిప్రోలు, కొల్లూరు మండల ప్రజా పరిషత్ అధికారులు చంద్రశేఖర్, ఐ.సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ఈనెల 23వ తేదీన నిర్వహించే గ్రామ సభలకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడి

పిట్టువారిపాలెంలో దారుణం

నలుగురికి గాయాలు.. వారిలో ఒకరి తలకు దెబ్బ



గాయపడిన వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, రాంబాబు, రూతమ్మ

చీరాల, ఆగస్టు 21 : టీడీపీ వర్గీయులపై వైసీపీ వర్గీయలు దాడి చేశారు. దాడిలో టీడీపీ వర్గీయులు నలుగురు గాయపడ్డారు. అందులో ఒకరి తలపై బలమైన గాయమైంది. చీరాల మండలం పిట్టువారిపాలెంలో బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. క్షతగాత్రులను చీరాల వైద్యశాలకు తరలించారు. అందులో తలకు బలమైన గాయమైన పిట్టు వెంకటేశ్వర్లును మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చీరాల మండలం పిట్టువారిపాలెంలో కొద్దిరోజుల కిందట ఎమ్మెల్యే కొండయ్య ఫొటోతో పలువురు, టీడీపీ వర్గీయులు తమ ఫొటోలతో ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలోని కొందరి ఫొటోలను గుర్తుతెలియని వ్యక్తులు చించేశారు. అది వైసీపీ వర్గీయుల పనిగా టీడీపీ వర్గీయులు భావించారు. ఇదిలావుంటే రెండు రోజుల కిందట భోజనాల కార్యక్రమం వద్ద వైసీపీకి చెందిన పిట్టు పోలయ్య, టీడీపీకి చెందిన పిట్టు బాలకృష్ణకు సంబంధించిన వారిమధ్య వాగ్వాదం జరిగింది. అది బుధవారం దాడికి దారితీసింది. ఘర్షణకు సంబంధించి టీడీపీ కార్యకర్త పిట్టు బాలకృష్ణ తదితరులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం గ్రామంలో వైసీపీకి చెందిన పోలయ్య మరికొందరు బాలకృష్ణ ఆటోను అడ్డుకున్నారు. మారణాయుధాలతో దాడికి తెగబడ్డారు. ఇది గమనించిన బాలకృష్ణ బంధువులు పిట్టు వెంకటేశ్వర్లు, పిట్టు రాంబాబు, రూతమ్మ పోలయ్య, అతని వర్గీయులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలయ్య, అతని వర్గీయులు బాలకృష్ణ, మిగిలిన ముగ్గురిపై దాడి చేసి గాయపరిచారు. అందులో వెంకటేశ్వర్లు తలపై బలమైన గాయమైంది. స్థానికులు క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తలకు బలమైన గాయమైన వెంకటేశ్వర్లును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మిగిలిన ముగ్గురికి స్థానికంగా చికిత్స చేశారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ అవుట్ పోస్టు పోలీసులకు తెలిపిన వివరాలలో తమపై పిట్టు పోలయ్య మరికొందరు ఉద్దేశపూర్వకంగానే దాడిచేసి గాయపరిచారని పేర్కొన్నారు. పిట్టు బాలకృష్ణ మరికొందరు తమపై దాడి చేసి గాయపరిచారని పిట్టు పోలయ్య అవుట్‌పోస్టు పోలీసులకు తెలిపారు. ఇరువర్గాల స్టేట్‌మెంట్లను పోలీసులు నమోదు చేశారు. పోలయ్యకు, అతని వర్గానికి చెందిన వారికి ఎలాంటి గాయాలు లేవని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. జరిగిన ఘటనల పూర్వాపరాలను పిట్టువారిపాలెం టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కొండయ్య దృష్టికి తీసుకెళ్లి వివరించారు. టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ ఘటన పూర్వాపరాలను తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన ఫోన్‌లో క్షతగాత్రులను పరామర్శించారు. ఇలాంటి చర్యలను తాము సహించబోమని, పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే కొండయ్య

టీడీపీ వారిపై వైసీపీ వర్గీయలు దాడికి సంబంధించి రాత్రికి ఎమ్మెల్యే కొండయ్య ఆ గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామ పార్టీ నాయకులు బుర్ల వెంకట్రావు తదితరుల ద్వారా క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలపై కొండయ్య ఆరా తీశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా, పార్టీపరంగా, వ్యక్తిగతంగా కార్యకర్తలకు కొండంత అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

కారు ఢీకొని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి



నాగార్జునరెడ్డి(ఫైల్)

చీరాలటౌన్, ఆగస్టు 21 : ఒక్కరోజు వ్యవధిలో చీరాల పరిధిలో మరో కారు ఢీకొని సచివాలయ ఉద్యోగి దుర్మరణం చెందారు. దీంతో మరో కుటుంబం రోడ్డున పడింది. చీరాల చుట్టుపక్కల రోడ్డు ప్రమాదాలు వరుసగా జరుగుతున్నాయి. నిర్లక్ష్యమే ఘటనలకు కారణంగా కన్పిస్తుంది. చీరాల మండలం కొత్తపాలెం పంచాయతీకి చెందిన పల్లపట్ల నాగార్జునరెడ్డి(31)కి భార్య శ్రావణి, ఏడాది పాప ఉన్నారు. ఇతను కారంచేడు మండలం తిమిడితపాడు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై స్వర్ణ రోడ్డులో వెళుతుండగా మార్గమధ్యలోని చప్టా వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగార్జునరెడ్డి మృతి చెందారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ మారీడు శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 3వ తేదీన నాగార్జునరెడ్డి సచివాలయంలో పుట్టినరోజును జరుపుకున్నారని సహచర సిబ్బంది గుర్తు చేసుకున్నారు. ఐడీ కార్డ్ ఆధారంగా సచివాలయ ఉద్యోగులకు ముందుగా సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన హాస్పిటల్ వద్దకు చేరుకుంటూనే నాగార్జునరెడ్డి తండ్రికి విషయం చెప్పారు. ఆసుపత్రికి చేరుకున్న నాగార్జునరెడ్డి భార్య శ్రావణి బిగ్గరగా మామ కాళ్లమీద పడి బోరున విలపించడం అందరినీ కలచివేసింది.

సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

పర్చూరు, అగస్టు 21 : మార్టూరు రూరల్ సర్కిల్ పరిధిలోని పర్చూరు సీఐగా జీఎల్ శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఏసీబీ సీఐగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పర్చూరు వచ్చారు. ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న సీ.శీతారామయ్యను రేంజి ఆఫీస్‌కు ఎటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును యద్దనపూడి ఎస్ఐ డి.రత్నకుమారి, ఎస్ఐ సురేష్ రెడ్డి, సర్కిల్ పరిధి సిబ్బంది, పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి


న్యాయాధికారులు ప్రశాంతి, శాంతి



సమీక్ష నిర్వహిస్తున్న న్యాయాధికారులు, ప్రశాంతి, శాంతి

పర్చూరు, ఆగస్టు 21 : సెప్టెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను వినిగియోంచుకోవాలని న్యాయాధికారులు కె.ప్రశాంతి, బి.శాంతి అన్నారు. బుధవారం కోర్టు భవనాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ జరిగేలా కక్ష్యదారులకు తెలియజేయాలన్నారు. రాజీపడిన కేసులకు సంబంధించిన అవార్డు కాపీలను ఇరువర్గాల సంతకాలతో పొందవచ్చన్నారు. ఈ కేసులకు ఎలాంటి అప్పీలు ఉండదన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పే అంతిమ తీర్పు అన్నవిషయాన్ని కక్ష్యదారులకు తెలియజేయాలని న్యాయవాదులకు సూచించారు. కక్ష్యలు కార్పణ్యాలకు పోయి జీవితాన్ని, సమయాన్ని వృథా చేసుకోవద్దని ప్రశాంతి, శాంతి సూచించారు.

మంత్రి ఆదేశాలతో పారిశుధ్యంపై అధికారుల దృష్టి



పారిశుధ్య చర్యలను చూస్తున్న ఈవో లక్ష్మీకాంత్

మేదరమెట్ల, ఆగస్టు 21 : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించారు. బుధవారం మేదరమెట్ల మిద్దెలడొంకలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగును అరికట్టడానికి చర్యలు చేపట్టారు. గతంలో ఉన్న పైపులు పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారి తోంది. దీంతో ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీసి కొత్త పైపులను ఏర్పాటు చేశారు.

నిఘానేత్రం.. నిస్తేజం!

దృష్టిసారించిన పోలీసు శాఖ

నేర పరిశోధనలో అవే కీలకం

మరమ్మతులపై మొదలైన కసరత్తు

అనేక కేసులలో దొరకని సీసీ ఫుటేజీ

పట్టించుకోని గత ప్రభుత్వం

ప్రతి దుకాణంలో ఏర్పాటుకు చర్యలు: ఎస్పీ



బస్టాండ్‌లో పనిచేయని కెమెరాలు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 21 : జిల్లాలో నిఘా నేత్రాన్ని పటిష్టం చేసేందుకు పోలీసు శాఖ సిద్ధమైంది. కేసుల దర్యాప్తులో సీసీ ఫుటేజీ కీలకంగా మారింది. ఆ కారణంగా ఇప్పటికే ఏర్పాటుచేసిన కెమెరాలను పరిశీలించి మరమ్మతులకు గురైతే వెంటనే చేయించడంతో పాటు పలు కీలక ప్రాంతాలలో సీసీ కెమెరాలను బిగించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. అలాగే ఎక్కువగా జనసమర్థం ఉండే దుకాణాలు, కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లు, కల్యాణమండపాల్లో తప్పనిసరిగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకునేలా పోలీసులు కసరత్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యంగా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం

గతంలో లక్షలు రూపాయలు వ్యయం చేసి కీలక సెంటర్లలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిఘా నేత్రం ప్రస్తుతం మసకబారింది. వాటి ఆలనాపాలన చూడటంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఆ కారణంగా నేర పరిశోధనలో పోలీసులకు తలనొప్పిగా మారింది. పలు కీలక కేసుల దర్యాప్తు క్లిష్టంగా మారింది. నగరంలో మ్యాట్రిక్స్ సహకారంతో సుమారు 200 సీసీ కెమెరాలు నగరంలో ఏర్పాటు చేయగా జిల్లా అంతటా 700కు పైచిలుకు ఉన్నాయి. గత నాలుగేళ్లగా వాటి మరమ్మతులు పట్టించుకోకపోవడంతో అనేక కెమెరాలు మూలనపడ్డాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన కెమెరాలు అసలు పనిచేయడం లేదు. ఇటీవల ఒంగోలు నగరంలో జరిగిన అనేక నేరాలలో సీసీ ఫుటేజీ కోసం వెతికిన పోలీసులకు చుక్కెదురైందనే చెప్పాలి.

తలనొప్పిగా మారిన నేర పరిశోధన

సీసీ కెమెరా వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడంతో నేర పరిశోధన పోలీసులకు తలనొప్పిగా మారింది. ఉదాహరణకు ఇటీవల నగర శివారు ప్రాంతంలో ఉన్న ఓ కల్యాణ మండపంలో వివాహం జరిగింది. అక్కడ పది సవర్ల బంగారం, లక్ష రూపాయలు నగదు ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను చిన్న పిల్లవాడు తీసుకొని వచ్చి దొంగల ముఠాకు ఇవ్వడం కల్యాణ మండపంలో ఉన్న సీసీ కెమెరాలలో కనిపించింది. అయితే వారు ఎక్కడకు వెళ్లారు, ఏటు వైపుగా వారి వాహనం వెళ్లింది అని పరిశీలించిన పోలీసులకు చుక్కెదురైంది. మంగమూరు రోడ్డు జంక్షన్‌లో కెమెరాలు పనిచేయడం లేదు, దక్షణ బైపాస్‌లో ఉన్న కెమెరాల పరిస్థితి అంతే. దీంతో దర్యాప్తు ముందుకు వెళ్లలేదు. అదేవిధంగా అగ్రహారం గేటు సమీపంలో బాతుల పెంపకందార్ల చిన్నారి అపహరణ కేసులోనూ సీసీ ఫుటేజీ కోసం వెతికితే ఎక్కడా దొరకలేదు. చివరకు ఓ ప్రైవేటు వ్యక్తి ఇంట్లో ఉన్న కెమెరా ఆధారంగా ఫుటేజీ సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపితే అది సరిగా లేదని తిరిగి రావడం గమనార్హం.

- నగరంలోని కాకతీయ నగర్‌లో ఈనెల 9న అర్ధరాత్రి భారీ దొంగతనం జరిగింది. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి ఇంటి ఎదుట ఉన్న బైక్‌పై పరారయ్యాడు. కాగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా అన్ని రోడ్లపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. శివారులో ఉన్న ఒక పెట్రోల్ బంక్‌లో ఉన్న కెమెరాలో నిందితుడు ఫుటేజి నిక్షిప్తమై ఉండడంతో అతనిని గుర్తించి వారంలో పట్టుకుని చోరీ సొత్తు మొత్తం రికవరీ చేయగలిగారు.
- నగరంలోని ఏనుగు చెట్టు సెంటర్‌కు సమీపంలో ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఓ యువకుడు ఇంటి యజమాని వృద్ధురాలిపై దాడి చేసి దోపిడీకి పాల్పడ్డాడు. ఈ కేసును ఛేదించేందుకు కీలకంగా ప్రైవేటు సీసీ ఫుటేజీ ఆధారమైంది. దర్యాప్తు పురోగతిలో ఉంది. ఇందుకు సీసీ ఫుటేజీ బాగా ఉపయోగపడింది.
- నగర శివారు ప్రాంతంలో బాతుల పెంపకం కోసం వచ్చి గుడారాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్న వారి వద్ద నుంచి చిన్నారిని కిడ్నాప్ చేసిన కేసులో సీసీ ఫుటేజీ కీలకమైంది. అయితే ప్రైవేటు కెమెరాల మీద ఆధారపడటం పోలీసుల వంతు అయింది.
- అదేవిధంగా దక్షణ బైపాస్ రోడ్డులో ఉన్న కల్యాణమండపంలో జరిగిన బ్యాగ్ చోరీ కోసం సీసీ ఫుటేజీ కోసం వెళ్లిన పోలీసులు అవాక్కయ్యారు. ఎక్కడా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఆ కేసులో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.
- ఇలా లక్షలాది రూపాయలు వ్యయం చేసి ఏర్పాటు చేసిన నిఘా కెమెరాల వ్యవస్థ మూలనపడింది. ఈ కెమెరాలకు సంబంధించిన కంట్రోల్ రూమ్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఉంది. కెమెరాలు పనిచేయకపోవడంతో ఉపయోగం లేకుండాపోయింది. కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిఘా వ్యవస్థపై దృష్టిపెట్టింది. పాత వాటికి మరమ్మతులు చేయడంతో పాటు కీలక ప్రాంతాల్లో కొత్తగా కెమెరాలు ఏర్పాటు చేసేలా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

బస్టాండ్‌లో పనిచేయని కెమెరాలు

ఒంగోలు నగరం మధ్యలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. సుమారు ఏడు ఉండగా అవన్నీ అలంకారప్రాయంగా మారాయి. అక్కడ ఏర్పాటు చేసిన కెమెరాలు నాణ్యత సరిగా లేకపోవడం వల్ల సరైన ఫుటేజీ ఇవ్వడం లేదు. అవన్నీ పాతకాలం నాటివి. వాటి సమయం కూడా పూర్తయ్యింది. వాటిని మార్చి హైపొటెన్షియాల్టీ ఉన్న కెమెరాలను ఏర్పాటు చేయాలంటూ పోలీసులు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు లేఖలు రాశారు. ఇంతవరకు స్పందించలేదు. నిత్యం వేలాదిమంది ప్రయాణికులు ప్రతిరోజూ ఇక్కడకు వస్తారు. దొంగతనాలు కూడా సర్వసాధారణమే. అయినా ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోకపోవడం గమనార్హం.

శివారు ప్రాంతాలో కెమెరాలు పనిచేయడం లేదు

నగర శివారు ప్రాంతాలలో ఉన్న కెమెరాలు ఎక్కడా పనిచేయడం లేదు. కొన్నిచోట్ల అసలు లేవు కూడా. దక్షణ బైపాస్, ఉత్తర బైపాస్, ఇందిరమ్మ కాలనీ, మంగమూరు రోడ్డు, ఆశ్రమం వద్ద ఉన్న కెమెరాలు పనిచేయడం లేదు. ఇంకా నగరంలో ఉన్న అనేక కెమెరాలు పరిస్థితి కూడా అలాగనే ఉంది. దీంతో పోలీసులకు నేర పరిశోధనకు చుక్కలు కనిపిస్తున్నాయి. లక్షల రూపాయల వ్యయం చేసి ఏర్పాటుచేసిన కెమెరాలు నిర్వహణ లోపం వలన ఇలాంటి పరిస్థితి వచ్చింది. కాగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ దామోదర్ ఈ సమస్యపై దృష్టిసారించారు. భారీగా కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

సీసీ కెమెరాలపై దృష్టిపెట్టాం

-ఎస్పీ ఏఆర్ దామోదర్

నగరంతోపాటు జిల్లా మొత్తం సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టిసారించాం. ఆ మేరకు పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. నగరంలో కొన్ని కెమెరాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయిస్తాం. అలాగే ప్రతి వంద మంది వచ్చిపోయే దుకాణాలు, కార్యాలయాలు, కళ్యాణ మండపాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇక నుంచి నిఘాను పటిష్టం చేసేందుకు సమగ్రమైన మార్పులు తీసుకొస్తాం. అపార్ట్‌మెంట్ల వద్ద కూడా తప్పనిసరిగా నిఘా ఉండేట్లు యాజమాన్యాలు బాధ్యత తీసుకోవాలి. తద్వారా నేరాలను అదుపుచేయడంతో పాటు ఎలాంటి చిన్నచిన్న సంఘటనలు జరిగినా వెంటనే పోలీసలు స్పందించేందుకు అవకాశం ఉంటుంది. నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకుందుకు వ్యాపారులు, ప్రముఖులు సహకరించాల్సి ఉంది.

పడకేసిన పాలన

కీలక శాఖల్లో హెచ్‌ఓడీలు లేక కొరవడిన పర్యవేక్షణ

ఇన్‌చార్జీలతో నామమాత్రంగా సాగుతున్న కార్యకలాపాలు

నెలాఖరుకు మరికొందరు ఉద్యోగ విరమణ

బదిలీల ఫీవర్‌తో ఇంకొందరు



ఒంగోలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేత, ఆయా శాఖల ఉద్యోగుల పర్యవేక్షణలో కీలకమైన ఉన్నతాధికారుల(హెచ్‌ఓడీ) పోస్టులు జిల్లాలో భారీగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గడిచిన ఎన్నికల సమయంలో కొందరు ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా మరికొందరు ఈ రెండు మూడు నెలల్లో ఉద్యోగ విరమణ చేశారు. ఇంకొన్ని శాఖలలో దీర్ఘకాలంగా కిందిస్థాయిలోని అధికారులే పూర్తి అదనపు బాధ్యత(ఎఫ్ఏసీ)లతో నెట్టుకొస్తున్నారు దీంతో ఆయా శాఖల పర్యవేక్షణ కొరవడింది. ఇలాంటివి జిల్లాలో దాదాపు 20 శాఖలు ఉండగా అందులో కొన్ని అత్యంత కీలకమైనవే ఉన్నాయి. మరోవైపు ఈ నెలాఖరుకు మరో ముగ్గురు ముఖ్యమైన అధికారులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ ప్రభావం జిల్లా పాలనా వ్యవస్థపై తీవ్రంగానే పడనుంది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఆయా రంగాలు, శాఖలవారీగా లక్ష్యాలను నిర్దేశించింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పెద్దల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలో పురోగతి కత్తి మీద సాములా కనిపిస్తోంది.

అంతా ఇన్‌చార్జి పాలన

ఎన్నికల సమయంలో సొంత జిల్లాకు చెందిన అధికారులు బదిలీలల్లో భాగంగా జడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీపీఓ నారాయణరెడ్డి మరికొందరు బదిలీ అయ్యారు. అంతకు ముందే ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పదవీ విరమణ చేశారు. అలాగే ఈ రెండు మూడు మాసాల కాలంలో కొందరు జిల్లా అధికారులు బదిలీలు, పదవీ విరమణలు చేశారు. అలా ప్రస్తుతం డీఆర్వో, జడ్పీ సీఈఓ, డీపీఓ, ఐసీడీఎస్ పీడీ, పంచాయతీరాజ్ ఎస్ఈ, డీఎంహెచ్ఓ, ఆత్మ పీడీ, బీసీ కార్పొరేషన్ ఈడీ, ఇంటర్ విద్య ఆర్ఐఓ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, స్టెప్ సీఈఓ, ఇరిగేషన్ ప్రాజెక్టుల ఎస్ఈ పోస్టులు ఖాళీగా ఉండి ఇన్‌ఛార్జీల పాలన నడుస్తోంది. కీలకమైన జడ్పీ సీఈఓతోపాటు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వంటి రెండు పోస్టులకు డిప్యూటీ కలెక్టర్ హోదాలోని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్‌గా ఉన్న మాధురి ఇన్‌చార్జీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒంగోలు డివిజనల్ అభివృద్ధి అధికారిగా ఉన్న ఉషారాణి డీపీఓతోపాటు గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారిగా ఉన్నారు. ఓడా వైస్ ఛైర్మన్‌గా ఉన్న విశ్వేశ్వరరావు డీఆర్వో ఇన్‌చార్జీగా ఉన్నారు. పీఆర్ ఎస్ఈగా గుంటూరు ఎస్ఈ ఇన్‌చార్జీగా ఉండగా ఇరిగేషన్ ఎస్ఈ నాగమురళీమోహన్ ఏకంగా మూడు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు ఇలా ఇతర శాఖలకు ఇన్‌చార్జీలే బాధ్యతాల్లో ఉండటంతో ఆయా విభాగాలలో అత్యవసర పనులు తప్ప క్రమపద్ధతిలో వ్యవహారాలు నడపడం లేదు.

ఉద్యోగ విరమణలు ఉన్నాయి

కాగా జిల్లాస్థాయిలో కీలక శాఖలైన మరో మూడింటిలో ఉన్నతాధికారులు ఈ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. జలవనరుల శాఖలో కీలకమైన ఉమ్మడి జిల్లాలోని ఎన్నెస్పీ ఆయకట్టు, వెలిగొండ, గుండ్లకమ్మ ఇతర ప్రాజెక్టులను పర్యవేక్షించే చీఫ్ ఇంజనీర్ కే.రవికుమార్ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. అలాగే సుదీర్ఘ కాలం జిల్లాపై పూర్తి అవగాహనతో పనిచేస్తున్న గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ మర్దన్‌ఆలీ హౌసింగ్ పీడీ పేరయ్యలు కూడా ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఇక మరికొందరు జిల్లా అధికారులు బదిలీ జరిగే అవకాశాలు ఉన్నాయన్న ఆలోచనతో మొక్కుబడిగా పనిచేస్తున్నారు. మొత్తంగా జిల్లాస్థాయి కీలకమైన హెచ్ఓడీ పోస్టులు భారీగా ఇన్‌చార్జీలతో సాగుతుండటంతో ఆయాశాఖలలో పర్యవేక్షణ లేకుండా పోయింది.

విమానాశ్రయం భూముల పరిశీలన

జేసీ గోపాలకృష్ణ, ఇతర అధికారుల హాజరు



కొత్తపట్నం(ఒంగోలు నగరం), ఆగస్టు 21: ఒంగోలుకు సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుకు అసరమైన భూములను బుధవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పరిశీలించారు. కొత్తపట్నం మండలం అలూరు- అల్లూరు గ్రామాల మధ్య ఉన్న భూములను ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. గతంలో వాన్‌పిక్ సంస్థ సేకరించిన భూముల్లో ప్రస్తుతం విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో 600 ఎకరాల భూమిని విమానాశ్రయం కోసం సేకరించనున్నారు. ఈ ప్రాంతంలోనే ఏర్పాటుకు కేంద్ర కమిటీ గతంలో భూములను పరిశీలించి వెళ్లింది. వైసీపీ ప్రభుత్వం విమానాశ్రయం ఏర్పాటుపై నీళ్లు చల్లింది. దీంతో ఈ ప్రక్రియ ఐదేళ్లుగా నిలిచిపోయింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మళ్లీ కదలిక వచ్చింది. భూములను పరిశీలించిన జేసీకి కొత్తపట్నం తహసీల్దార్ మధుసూదనరావు, ఇతర రెవెన్యూ సిబ్బంది వివరాలను తెలియజేశారు. విమానాశ్రయ ప్రతిపాదిత భూమి సముద్రానికి ఎంత దూరంలో ఉంది, లోతట్టు ఉందా వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లతో కబ్జా

వైసీపీ హయాంలో భూఅక్రమాలు వెలుగులోకి

కుంటపోరంబోకు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ

ముడుపులు తీసుకొని ఇష్టారాజ్యంగా

వ్యవహరించిన కొందరు అధికారులు

కూటమి ప్రభుత్వం రాకతో బయటకు వస్తున్న అక్రమాలు

రికార్డులను జల్లెడపడుతున్న కొత్త అధికారులు



పొజిషన్ సర్టిఫికెట్ ద్వారా స్వాహకు యత్నాలు చేస్తున్న పోరంబోకు భూమి

దర్శి, ఆగస్టు 21 : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, స్థలాలకు రక్షణ లేకుండాపోయింది. వాటిని స్వాహా చేసేందుకు కొంతమంది అక్రమార్కులు కొత్త ఎత్తులు ప్రదర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా కుంటపోరంబోకు భూములకు, ప్రభుత్వ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. గతంలో పనిచేసిన అధికారులు కొంతమంది లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకొని వైసీపీ నాయకులకు అడ్డగోలుగా సర్టిఫికెట్లు ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులు రికార్డులను జల్లెడపట్టి అక్రమాలను వెలికితీస్తున్నారు. తాజాగా దర్శి రెవెన్యూలోని 450/7 సర్వేనెంబర్‌లోని కుంట పోరంబోకు భూమికి ఒక వైసీపీ నాయకుడు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పొజిషన్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. ఈ విషయం కార్యాలయంలో సిబ్బందికి తెలిసినప్పటికీ అప్పుడు ఏమి మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు. ప్రభుత్వం మారటంతో కొత్త అధికారులకు గతంలో జరిగిన అక్రమాల సమాచారాన్ని ప్రస్తుత అధికారులకు అందిస్తున్నారు. 450/7 సర్వేనెంబర్‌లో 1.19 ఎకరాలు కుంటభూమి ఉంది అందులో 86 సెంట్లు రైల్వే లైను కిందపోయింది. ఇంకా 33 సెంట్లు ఖాళీగా ఉంది. దర్శి-తూర్పుగంగవరం ప్రధాన రహదారిని అనుకొన్ని ఉన్న ఈ స్థలం స్వాహాకు ఆ వైసీపీ నాయకుడు పథకం ప్రకారం పొజిషన్ సర్టిఫికెట్ తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం అక్కడ సెంటు ధర రూ.10 లక్షలకు పైగా ఉంది. సుమారు రూ.3 కోట్లు విలువ చేసే కుంట పోరంబోకు భూమిని కైవసం చేసుకునేందుకు పావులు కదిపాడు.

అదేవిధంగా దర్శి పట్టణంలో అనేక విలువైన స్థలాలకు వైసీపీ సానుభూతిపరులు పొజిషన్ సర్టిఫికెట్లు పొందినట్లు తెలుస్తుంది. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకొని ఆ స్థలాల్లో నిర్మాణాలు చేశారు. రికార్డుల్లో తమకు పూర్తి హక్కులు కల్పించుకునేందుకు నగర పంచాయితీ కార్యాలయానికి వెళ్లి పన్ను కట్టించుకోవాలని అక్రమార్కులు కోరుతున్నారు. గతంలో ఇచ్చిన పొజిషియన్ సర్టిఫికెట్లు చూపించి అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. బండిదారి, వాగుపోరంబోకు, కుంట పోరంబోకు భూములకు నిబంధనలకు విరుద్ధంగా అధికారులు ముడుపులు తీసుకొని సర్టిఫికెట్లు ఇవ్వటంతో ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఈ విషయంపై తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా కుంట పోరంబోకు భూమికి గతంలో పొజిషన్ సర్టిఫికెట్ తీసుకున్నట్లు సమాచారం తెలిసిందన్నారు. ఆ భూమికి సర్టిఫికెట్ పొందే అవకాశం లేదని చెప్పారు. ఆ భూమికి కంచె ఏర్పాటు చేసి భద్రపరుస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్లు తీసుకున్న వారి వివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మంత్రి పర్యటన

అద్దంకి, ఆగస్టు 21 : మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం పలు కార్య క్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటలకు మార్టూరు, 9-30 గంటలకు కొండమంజులూరు, 9-45 గంటలకు భగవాన్‌రాజుపాలెం, 10 గంటలకు పంగులూరు, 10-30 గంటలకు జాగర్లమూడివారిపాలెం, 11 గంటలకు బొమ్మనంపాడు, 11-30 గంటలకు అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, 11-45 గంటలకు 4వ వార్డు, 12 గంటలకు ఆయిల్‌మిల్ రోడ్డు, 12-30 గంటలకు చినకొత్తపల్లిలో కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు.



వైభవంగా పోలేరమ్మ కొలుపులు

ఇంకొల్లు, ఆగస్టు 21 : మండలంలోని గొల్లపాలెంలో గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి కొలుపులు వైభవంగా నిర్వహించారు. ప్రజలు పాడి పంటలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ అమ్మవారికి పాలపొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. కొలుపులు సందర్భంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు సామూహిక రాజ్యలక్ష్మీ వ్రతాలు

చినగంజాం, ఆగస్టు 21 : భూసమేత భావనారాయణ స్వామి దేవస్థానంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం సామూహిక రాజ్యలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జీ పిచ్చయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం రాజ్యలక్ష్మీ అమ్మవారికి విశేష పంచామృత స్నపన తిరువంజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి వ్రతంలో ముత్తయిదువులు, కన్యలు పాల్గొనవచ్చునని తెలిపారు. వ్రతంలో పాల్గొనే మహిళలు ఆలయ అర్చకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులును సంప్రదించాలని పిచ్చయ్య కోరారు.

సాగర్ కాలువలపై వైసీపీ నిర్లక్ష్యం

- ఐదేళ్లూ మరమ్మతులు పట్టించుకోని పాలకులు
- స్వచ్ఛందంగా కదిలిన రైతులు
- రూ.1.5లక్షలతో చేపట్టిన పూడికతీత పనులు

అద్దంకి, ఆగస్టు 21 : గత ఏడాది సాగర్ ఆయకట్టుకు సాగు నీరు విడుదల కాకపోవడం, వైసీపీ పాలకులు సాగర్ కాలువల మరమ్మతులను పట్టించుకోకపోవడంతో పంట పొలాలకు నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుతం సాగర్ నీరు సాగుకు విడుదలైనా పొలాలకు చేరడం కష్టంగా మారింది. పూడిక తీత పనుల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ నిధులు లేవని తెలిపారు. దీంతో రైతులు స్వచ్ఛందంగానే కాలువ పూడిక తీత పనులు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. వెంపరాల మేజర్, చినకొత్తపల్లి మైనర్ కాలువల పూడిక తీత పనులు బుధవారం నుంచి ప్రారంభించారు. ఆయకట్టులో వి.కొప్పెరపాడు, గోవాడ, చినకొత్తపల్లి, సాధునగర్ గ్రామాల రైతులు సుమారు 1.5 లక్షల రూపాయలను వసూలు చేసి రెండు ఎక్స్‌కవేటర్‌లతో పనులు చేస్తున్నారు. వెంపరాల మేజర్‌లో కొత్తూరు రోడ్డు నుంచి సుమారు 2కి.మీ. చినకొత్తపల్లి మైనర్‌లో సుమారు 4కి.మీ దూరం పూడిక తీత పనులు చేస్తున్నారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్న 5 సంవత్సరాలూ సాగర్ కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడంతో కాలువలు మరింత అధ్వానంగా మారాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు కామినేని శ్యామలరావు, సోమేపల్లి రాము, నరిశెట్టి వీరాంజనేయులు, స్వాములు తదితరులు ఆయకట్టు రైతులను సమన్వయం చేసుకుంటూ పూడికతీత పనులు చేపడుతున్నారు.



చినకొత్తపల్లి మైనర్‌లో ఎక్స్‌కవేటర్‌తో పూడికను తొలగిస్తున్న రైతులు

కుంకలమర్రు గ్రామ సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు జారీ

కుంకలమర్రు(పర్చూరు), ఆగస్టు 21: కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు గ్రామంలో జువ్వా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించిన మంచినీటి పథకానికి పంచాయతీ ద్వారా నీటి సప్లయ్‌కి సంబంధించి గ్రామ సర్పంచ్‌కు జిల్లా పంచాయతీ అధికారి బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సర్పంచ్, గ్రామ కార్యదర్శి ట్రస్ట్‌కు నీటిని సరఫరా చేశారని దీనికి సంబంధించి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

రైతులందరికీ పట్టాలు : ఆర్డీవో

సంతమాగులూరు, ఆగస్టు 21 : మండలంలోని గోపాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోగల అగ్రహారం భూములు సాగు చేస్తున్న రైతులందరికీ పట్టాలను అందజేస్తామని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సంతమాగులూరు మండలంలోని గోపాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని భూములను బుధవారం ఆర్డీవో పరిశీలించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ముక్తేశ్వరంలో ఎబేట్‌ను చల్లిస్తున్న కార్యదర్శి బాజీ

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

- మంత్రి రవికుమార్ ఆదేశాలతో గ్రామాల్లో పారిశుధ్య పనులు

బల్లికురవ, ఆగస్టు 21 : సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పలు గ్రామాలలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో శరవేగంగా శానిటేషన్ పనులు చేయిస్తున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గంలో విష జ్వరాలు అధికంగా ఉన్నాయని తక్షణమే ఆరోగ్య శిబిరాలు, శానిటేషన్ పనులు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల కిందట జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ బల్లికురవను సందర్శించి తక్షణమే శానిటేషన్ పనులు చేయాలని ఆదేశించారు. దీనిపై బుధవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి షేక్ బాజీ విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా ఎబేట్ మందును చల్లించారు. అలానే బావులలో నీటి క్లోరినేషన్ చేయించారు. రోడ్ల వెంబడి వ్యర్థాలు లేకుండా చర్యలు చేడతామని తెలిపారు. ఉప్పుమాగులూరు గ్రామంలో కార్యదర్శి ప్రసాదరెడ్డి గ్రామంలో ఉన్న మురికి కాలువల్లో వ్యర్థాలను తీయించి బ్లీచింగ్ సున్నం చల్లించారు. మండల కేంద్రంలో ఇన్‌చార్జి కార్యదర్శి అనిల్‌కుమార్ మండల కార్యాలయాలు ఉన్న వీధిలో మురుగు నీరు నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు, ఈవోపీఆర్డీ సుమతి పలు గ్రామాలలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి సీజనల్ జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు శానిటేషన్ పనులు కొనసాగించాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు.

450 మంది రోగులకు వైద్య సేవలు

ఇంకొల్లు, ఆగస్టు 21 : మండలంలోని వంకాయలపాడు వలేవేటి సత్యవేణి గార్డెన్‌లో క్రీశే సత్యవాణి 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం నిర్వహించిన ఉచిత మోగా ఆయుర్వేద వైద్య శిబిరంలో 450 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలందించారు. వైద్య శిబిరాన్ని ప్రముఖ న్యాయవాది రావి సత్యనారాయణ ప్రారంభించారు. రోగులకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసారు. ప్రముఖ వైద్యుడు పి.మురళీకృష్ణ, విష్ణుప్రియ, చైతన్య, సయ్యద్ నజీబ్‌ఉల్లా, షాలినీ, విద్యాసాగర్, శ్రావణ్ పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో చెన్నకేశవాచార్యులు, టి.బుచ్చిబాబు, నిర్వాహకులు వలివేటి రామారావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో బాపట్ల వ్యక్తి అరెస్ట్

400 గ్రాములు స్వాధీనం

చీరాలటౌన్, ఆగస్టు 21 : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని చీరాల వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల 33వ వార్డు ఆరవపాలెంకు చెందిన అత్తుమూరి ప్రేమ్‌కుమార్ మంగళవారం రాత్రి చీరాల ఆర్వోబీ వంతెన కింద గంజాయిని విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి అతడిని పట్టుకున్నారు. అతడి వద్ద 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం బుధవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ప్లేట్లు

అద్దంకిటౌన్, ఆగస్టు 21: మండలంలోని గోపాలపురం అంగన్‌వాడీ కేంద్రానికి దాతలు విద్యార్థులకు, వంటకు అవసరమైన సామగ్రిని అందజేశారు. బుధవారం గ్రామానికి చెందిన యర్రా కోటిస్వాములు, ఆదిలక్ష్మి దంపతులు, కుమారుడు , కోడలు గోపాలకృష్ణ, పూజిత గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బ్యాగ్‌లు, ప్లేట్లు, గ్లాసులు, పలకలు, పెన్నులు, వాటర్ బాటిల్స్, డ్రాయింగ్ బుక్స్, చైర్స్, టేబుల్స్‌తో పాటు వంట పాత్రలు అందజేశారు. సూపర్‌వైజర్ ఇందిరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు అచ్చమ్మ, రమణకుమారి చిన్నారుల తల్లులు పాల్గొని దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

చీరాలటౌన్, ఆగస్టు 21 : చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధుడు బుధవారం మృతి చెందారు. మృతుడు మంగళవారం సాయంత్రం చీరాల రైల్వే స్టేషన్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. రైల్వే పోలీసులు 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. అతని వద్ద సూరారెడ్డి పాలెం - చీరాల రైల్వే టికెట్ ఉందని తెలిపారు. అలాగే తెలుపు రంగు నిండు చేతుల చొక్కా, నలుపు రంగు లోయర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ముఖంమీద కుడి పెదవి వైపు పుట్టు మచ్చ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9440 627 646 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చీరాలటౌన్, ఆగస్టు 21 : కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని చీరాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి చీరాల పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ మహిళలపై ఘోరాలకు పాల్పడుతున్న వారిపై శిక్షలు కఠినతరం చేస్తేనే దాడులు ఆగుతాయని అన్నారు. ర్యాలీలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మూడోరోజూ కొనసాగిన వైద్య శిబిరం

బల్లికురవ, ఆగస్టు 21 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో మూడోవ రోజు బుధవారం కూడా వైద్య శిబిరం నిర్వహించారు. గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి భారతి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఎవరైనా గున్యా, జ్వరాలతో బాధపడుతుంటే వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

అర్థమయ్యేలా బోధన చేయాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 21: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఎంఈవోలు డీ గంగాధరరావు, బీ సుధాకరరావు సూచించారు. బుధవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో టీచ్‌టూల్ కార్యక్రమంలో భాగంగా అబ్జర్వర్‌లకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ బోధన విధానాన్ని అబ్జర్వర్‌లు పరిశీలించాలన్నారు. నేటి నుంచి కేటాయించిన ప్రకారం టీచర్లు బోధన పరిశీలించాలని, ఇలా వారానికి రెండు తరగతులు చొప్పున నెలకు 8 పూర్తి చేసి సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌యంలు, ఉపాధ్యాయులు ప్రోగ్రాంకు సహకరించాలని, టెక్నికల్ సమస్యలు ఏమైన తలెత్తినప్పుడు మాస్టర్ ట్రైనీలు నాగేశ్వరరావు, మల్లికార్జున, ధనలక్ష్మిల సలహాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 28 మంది అబ్జర్వర్‌లు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 21: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా వర్కర్స్ స్కీం డీఆర్‌పీ గాలి స్వరూప్‌కుమార్ అన్నారు. బుధవారం అద్దంకిలోని భవిష్య హైస్కూల్ నందు ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రతినిధులు మీకు తెలుసా అనే కార్యక్రమంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీసీ రమేష్, అంజలీదేవి, వెంకటేష్, స్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదనరావు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో కుమారి

ఎకరాకు మూడు కేజీల గుళికలు వేయాలి

బల్లికురవ, ఆగస్టు 21 : మొక్కజొన్న పంటలో మొవ్వ పురుగు, కత్తెర పురుగు నివారణకు రైతులు ఎకరాకు 3కేజీల గుళికలను ఆకు సుడులలో వేసుకోవాలని వ్యవసాయ అధికారి కుమారి తెలిపారు. మండలంలోని కొత్తూరు, వెలమవారిపాలెం గ్రామాలలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వరి నారుమడులను ఏవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నారు మడులు సెంట్‌కు 160 గ్రాముల గుళికలు వేసుకుంటే చీడ పీడల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. రైతులు వరి నాట్లు వేసే ముందు ఎకరాకు 20కేజీల జింక్ సల్ఫేట్‌ను చల్లితే తెగుళ్ల బారినుంచి పంటను రక్షించు కోవచ్చని తెలిపారు. ఈ పరిశీలనలో వీఏఏ చెన్నకేశవ రెడ్డి, ప్రసన్న పాల్గొన్నారు.

డిగ్రీ కోర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చీరాలటౌన్, ఆగస్టు 21 : 2024-25 విద్యా సంవత్సరమునకు 2వ ఫేజ్‌లో డిగ్రీ కోర్స్ (బీఏ, బీకాం)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మురళి తెలిపారు. గురువారం నుంచి శనివారంలోపు సంప్రదించాలని చెప్పారు.

ఈనాం సాగుదారులకు పాసుపుస్తకాలు

ఆర్డీవో సూర్యనారాయణ

బల్లికురవ, ఆగస్టు 21 : ఈనాం భూముల సాగుదారులకు రికార్డు ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తామని చీరాల ఆర్డీవో సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయంలో ఈనాం భూముల రికార్డులను పరిశీలించిన అనంతరం సాగు చేస్తున్న చెన్నుపల్లి, కొండాయపాలెం, ముక్తేశ్వరం, మక్కెనవారిపాలెం, కొత్తపాలెం గ్రామాల రైతులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో రైతులతో మాట్లాడుతూ 1986లోనే ఈనాందారులకు ఒక వంతు, రైతులకు రెండు వంతుల చొప్పున భూములు కేటాయిస్తూ రికార్డులో నమోదై ఉందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రికార్డు ప్రకారం పట్టాదారు పాసు పుస్తకాలను అందజేస్తామని అయన తెలిపారు. ఇందుకు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తు తాము ఎన్నో ఏళ్ల నుంచి భూములు సాగు చేస్తున్నామని ఇప్పుడు ఒక వంతు ఈనాందారులకు ఎలా కేటాయిస్తారని గతంలో కూడా పలు మార్లు సమావేశాలు జరగగా ఇదే విషయం తెలియజేశామని ఆర్డీవో దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ దృష్టికి రైతులు తెలిపిన సమస్యను రికార్డును తీసుకు వెళతామని అయన రైతులతో తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్, వీఆర్వో వీరయ్య పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో సూర్యనారాయణ

భీమవరంలో నేత్రదానం

ఇంకొల్లు, ఆగస్టు 21 : మండలంలోని భీమవరంలో బుధవారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన అన్నెం కాంతయ్య (100) మృతి చెందారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కాంతయ్య కుటుంబ సభ్యులు రాఘవయ్య, లక్ష్మి, శ్రీమన్నారాయణను కమిటీ సభ్యులు అభినందించారు.

బంద్ ప్రశాంతం



తహసీల్దార్ ప్రశాంతికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

చీరాలటౌన్, ఆగస్టు 21 : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన బంద్ బుధవారం చీరాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఈక్రమంలో ప్రతినిధులు ఉదయం నుంచే చీరాల బస్టాండ్ వద్దకు చేరుకుని బస్‌లు నిలిపి వేశారు. అలాగే కొన్ని పాఠశాలలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛంగా మూశారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగనీయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మధ్యాహ్నం నుంచి వ్యాపారాలు దుకాణదారులు నిర్వహించారు.

మార్టూరు : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం మాల నాయకులు చేపట్టిన బంద్ కార్యక్రమం మార్టూరులో ప్రశాంతంగా ముగిసింది. మార్టూరు గ్రామంలోని వివిధ సంఘాలకు చెందిన మాల నాయకులు ఉదయం నేతాజీనగర్, రామ్‌నగర్ కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ద్విచక్రవాహనాలపై ర్యాలీగా బంద్ కార్యక్రమాన్ని కొనసాగించారు. తహసీల్దార్ టీ ప్రశాంతికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో బొల్లాపల్లి జెన్నిబాబు, పవన్, ఉలాస గాంధీ, రవి, శామ్యూల్, మైలా నాగేశ్వరరావు పాల్గొన్నారు. స్టేషన్ హవుస్ ఆఫీసర్ శేషగిరిరావు, ఏఎస్ఐ సైదా బందోబస్తు నిర్వహించారు.

ఇంకొల్లు : ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం జరిగి బంద్‌కు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ రమణయ్య ఆధ్వర్యంలో ఎస్సై సురేష్, సిబ్బంది అల్లర్లు జరకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

పంగులూరు : వర్గీకరణకు వ్యతిరేకంగా పంగులూరులో బుధవారం బంద్ నిర్వహించారు. అంబేడ్కర్ యూత్ సభ్యులు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దుకాణాలను మూయించారు. కార్యక్రమంలో బొల్లా చెన్నయ్య, నరేంద్ర పాల్గొన్నారు.

బల్లికురవ : ఎస్సీ వర్గికరణను రద్దు చేయాలని కోరుతూ గురువారం మండలం కొప్పెరపాడు గ్రామంలో మాల సంఘం నేతలు బంద్ నిర్వహించారు. దేశ వ్యాప్త బంద్‌లో భాగంగా కొప్పెరపాడు ఉన్నత పాఠశాల, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును మూసివేయించారు. ఎస్సీ వర్గికరణను రద్దు చేసి అందరికి సమ న్యాం చేయాలని లేకుంటే ఉద్యమం తప్పదు అని వారు తెలిపారు. కార్యక్రమంలో దమ్ము కోటేశ్వరరావు, గంగయ్య, అంజనేయులు, రామారావు, నారాయణ పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అద్దంకిలో మాల మహానాడు, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. భవానీ సెంటర్ నుంచి బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పలు ప్రైవేట్ స్కూల్స్, బ్యాంక్‌లను, వ్యాపర సంస్థలను మూసి వేయించారు. కార్యక్రమంలో మాల మహానాడు అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్, నాయకులు నాగేశ్వరరావు, సుబ్బారావు, శ్రీకృష్ణ, పాల్గొన్నారు. రూరల్ సీఐ శివరామకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

చినగంజాం : ఎస్సీ, ఎస్టీలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలించాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మేడికొండ సునీల్ డిమాండ్ చేశారు. మాల మహానాడు నాయకులు బుధవారం బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు వరికూటి బుల్లిబాబు, కవలదాస్, చిన్న, నాగరాజు, పెద బాబు, వాసు, అఖిల్ పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. చీరాల ఇన్‌చార్జి డీఎస్పీ జగదీష్‌నాయక్, ఇంకొల్లు సీఐ రమణయ్య పరిశీలించారు.

పర్చూరు : పర్చూరులో బుధవారం బంద్ ప్రశాంతంగా ముగిసింది. బొమ్మల సెంటర్‌లో బస్సులను నిలిపివేసి ధర్నా చేశారు. మానవహారం ఏర్పాటు చేసి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ప్రేమ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు వడ్డెముక్కల అబ్రహం, కంభం మార్కు, నలిగిల కిషోర్, ఇస్సాక్, స్వరాజ్ కుమార్, రత్నరాజు, వంశీ, సుధాకర్, రోశయ్య పాల్గొన్నారు. మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.శేతారామయ్య, నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. యద్దనపూడి ఎస్సై డి.రత్నకుమారి, పర్చూరు ఏఎస్ఐ సురేష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సోపిరాలలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రభాకరరావు

ఓటర్ల జాబితా సర్వే పరిశీలన

చినగంజాం, ఆగస్టు 21 : మండలంలోని సోపిరాల గ్రామంలో జరుగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 డోర్ టూ డోర్ సర్వేని ఏఈఆర్వో, తహసీల్దార్ జి.ప్రభాకరరావు బుధవారం పరిశీలించారు. సోపిరాల పోలింగ్ స్టేషన్-274వ నెంబరులో నిర్వహిస్తున్న ఫొటో ఎలక్టోరోల్ సర్వేలోని కొంత మంది ఓటర్ల జాబితాను బీఎల్‌వో యాప్‌లో ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈ సర్వేకి సంబంధించిన ఓటరు జాబితాలో ఏమైనా దిద్దుబాట్లు ఉంటే వెంటనే సరిచేయాలని తహసీల్దార్ సూచించారు. తప్పులుంటే ఫారం-8, డెత్, డబుల్ ఎంట్రీలు ఏమైనా ఉంటే ఫారం-7, నూతనంగా ఓటు నమోదు చేయాలనుకునే వారికి ఫారం-6ని బూత్‌లెవల్ అధికారుల యాప్‌లో దరఖాస్తు చేయాలన్నారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారి ఆమంచి సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ ఈ.శ్రీనివాసరావు, మండల ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్ వై.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మలాది సుబ్బరామయ్యతో మాట్లాడుతున్న మంత్రి

పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి

అద్దంకి, ఆగస్టు 21 : పలు కుటుంబాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం పరామర్శించారు. మండలంలోని చక్రాయపాలెంలో పిడతల నాగార్జున ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, తల్లి నెల రోజుల కిందట మృతి చెందారు. నాగార్జున కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన గుమ్మడి శ్రీనివాసరావు, యడ్లపల్లి వెంకటరత్నం, బొల్లా బసవమ్మ కుటుంబ సభ్యులను రవికుమార్ పరామర్శించారు. అద్దంకి పట్టణంలోని 14వ వార్డుకు చెందిన నాగూర్‌బాషా రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, కుటుంబసభ్యులను పరామర్శించారు. భవానీసెంటర్‌లో కొత్తగొర్ల పున్నారావు కేన్సర్‌తో బాధపడుతుండగా మంత్రి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చెరువుకొమ్ముపాలెంలో ఆడిటర్ మలాది సుబ్బరామయ్య కుమార్తె ఇంజనీరింగ్ విద్యార్థిని జనసీ ప్రసన్న డెంగ్యూతో మృతి చెందగా కుటుంబసభ్యులను మంత్రి గొట్టిపాటి ఓదార్చారు. ఆయనవెంట స్థానిక నాయకులు ఉన్నారు.